


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 359, పేజీలు - 08




శుక్రవారం, జూన్ 19, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

# కిషన్ రెడ్డిపై రేవంత్ బీఆర్ఎస్ ముద్ర

## - రాజకీయ వ్యూహమా? నిధులు రాబట్టే మైండ్ గేమా.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిల మధ్య సాగుతున్న మాటల యుద్ధం కేవలం పైకి కనిపిస్తున్న రాజకీయ విమర్శ మాత్రమే కాదు దాని వెనుక అత్యంత వ్యూహాత్మకమైన, లోతైన పొలిటికల్ అండ్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ దాగుంది. కేంద్రంలో క్యాబినెట్ మంత్రిగా, రాష్ట్రంలో బీజేపీకి పెద్ద దిక్కుగా ఉన్న కిషన్ రెడ్డిని రేవంత్ రెడ్డి పదే పదే టార్గెట్ చేయడం, ఆయనపై బీఆర్ఎస్ ముద్ర వేయడం వెనుక సీఎం రేవంత్ రెడ్డి పక్కా ప్లాన్ ప్రకారం అడుగులు వేస్తున్నారు.

### హోదా సమానమే.. అయినా బీఆర్ఎస్ ముద్ర ఎందుకు?

సాంకేతికంగా చూస్తే కిషన్ రెడ్డికి కేటీఆర్ మాట వినాల్సిన అవసరం అస్సలు లేదు. కిషన్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర క్యాబినెట్ మంత్రి హోదాలో ఉన్నారు, పైగా రాష్ట్రంలో బీజేపీ గెలిస్తే సీఎం రేసులో ఉండే అత్యంత సీనియర్ నేత. అయినప్పటికీ, రేవంత్ రెడ్డి ఆయనను కేటీఆర్ చెప్పినట్లే ఆడుతున్నారు అని విమర్శించడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహం ఉంది. తెలంగాణలో బీఆర్ఎస్ బలహీనపడుతున్న తరుణంలో, కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదుగుతోంది. ఈ తరుణంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒకటేనని, వాటి మధ్య చీకటి ఒప్పందం ఉందనే భావనను ప్రజల్లో బలంగా నాటడం ద్వారా రెండు పార్టీలను ఒకే దెబ్బకు బలహీనపరచాలనేది రేవంత్ రెడ్డి పొలిటికల్ ప్లాన్.




### నిధులు రాబట్టే రివర్స్ సైకాలజీ వ్యూహం!

ఇక పరిపాలనా కోణంలో చూస్తే రేవంత్ రెడ్డి ఇక్కడ అత్యంత చాకచక్యంగా రివర్స్ సైకాలజీ ని ప్రయోగిస్తున్నారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెద్ద ప్రాజెక్టుల అనుమతులు కేవలం సామరస్యపూర్వక చర్చలతో రావడం లేదని రేవంత్ భావిస్తున్నారు. అందుకే, తెలంగాణకు చెందిన ఏకైక కేంద్ర క్యాబినెట్ మంత్రి కిషన్ రెడ్డి ఆయనే ఢిల్లీలో ఒత్తిడి తెచ్చి మన ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారు అని పబ్లిక్‌గా నిందలు వేస్తున్నారు. ఇలా చేయడం వల్ల కిషన్ రెడ్డి డిఫెన్స్‌లో పడతారు. తనపై పడ్డ తెలంగాణ

2లో..

# రాజ్యసభ ఎన్నికల్లో సంచలనం

## - జార్ఖండ్ నుంచి గెలిచిన వైసీపీ మాజీ ఎంపీ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పరిమల్ నత్వానీ మరోసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. జార్ఖండ్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆయన విజయం సాధించారు. అయితే ఈ ఎన్నికల ఫలితాలు జార్ఖండ్‌లోని అధికార జేఎంఎం కూటమిలో విభేదాలను తెరమీదకు తెచ్చాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి
జార్ఖండ్‌లో రెండు రాజ్యసభ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. 81 మంది సభ్యులున్న జార్ఖండ్ అసెంబ్లీలో ఒక్క రాజ్యసభ స్థానాన్ని దక్కించుకోవడానికి కనీసం 28 ఎమ్మెల్యేల 'మొదటి ప్రాధాన్యత' ఓట్లు అవసరం ఉంది.
జార్ఖండ్ అసెంబ్లీలో అధికార జేఎంఎం, కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి పార్టీలు 56 మంది సభ్యుల బలాన్ని కలిగి ఉంది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి 24 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. అంటే, జేఎంఎం, కాంగ్రెస్ కూటమి రెండు స్థానాలు కైవసం చేసుకోవడానిక సరిపడ బలం ఉంది. మరోవైపు బీజేపీ ఒక్క రాజ్యసభ స్థానం కైవసం చేసుకోవాలంటే మరో నాలుగు ఓట్లు తక్కువగా ఉన్న పరిస్థితి.
ఈ క్రమంలో కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రణవ్, జేఎంఎం అభ్యర్థిగా వైద్యనాథ్ బరిలో నిలిచారు. అయితే ఇక్కడే బీజేపీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. ఎన్డీయే కూటమి మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా పరిమల్ నత్వానీ బరిలో నిలిపింది. రెండు స్థానాలకు ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలవడంతో అక్కడ ఎన్నిక అనివార్యమైంది. ఈ క్రమంలోనే

2లో..

## ఎవరేమనుకున్నా మూసీ నది

# ప్రక్షాళన చేసి తీరుతాం

### - వనమహోత్సవం - 2026 లో సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చే ప్రతిష్టాత్మకమైన మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేసి తీరుతామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి గురువారం రోజున హైదరాబాద్ ఎల్‌బీ నగర్ నియోజకవర్గం పరిధిలోని గుర్రంగూడ ఎకోపార్క్‌లో మొక్కను నాటి వనమహోత్సవం - 2026 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎకో పార్క్‌లో ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకించారు.



2లో..

# స్విస్ బ్యాంకుల్లో తగ్గిన భారతీయుల నిధులు


- మొత్తం నిధులు 3.25 బిలియన్ ఫ్రాంక్స్‌కు పరిమితం
- అదే సమయంలో 50 శాతం పెరిగిన కస్టమర్ డిపాజిట్లు
- స్విస్ నేషనల్ బ్యాంక్ వార్షిక నివేదికలో వెల్లడి




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** స్విస్ బ్యాంకుల్లోని భారతీయ ఖాతాదారులు, సంస్థలకు సంబంధించిన నిధులు 2025లో 8 శాతానికి పైగా తగ్గుముఖం పట్టాయి. స్విస్ నేషనల్ బ్యాంక్ విడుదల చేసిన వార్షిక గణాంకాల ప్రకారం, భారతీయుల మొత్తం నిధులు 3.25 బిలియన్ స్విస్ ఫ్రాంక్స్‌కు (సుమారు రూ. 36,793 కోట్లు) చేరాయి. 2024లో ఈ నిధులు మూడు రెట్లు పెరిగి 3.55 బిలియన్ ఫ్రాంకులకు చేరిన నేపథ్యంలో, తాజా తగ్గుదల ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నివేదిక ప్రకారం, 2025లో మొత్తం నిధులు తగ్గినప్పటికీ, భారతీయ వ్యక్తులు, సంస్థలు నేరుగా జమ చేసిన కస్టమర్ డిపాజిట్లు మాత్రం 50 శాతానికి పైగా వృద్ధి

2లో..

# నాన్-సీరియస్ ప్లేయర్స్‌కు ఏపీలో చోటు లేదు



- రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో రూ. 30,515 కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో సుమారు 30 వేల ఉద్యోగాలు రానున్నాయని అంచనా
- పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు పేద, మధ్య తరగతికి చేర్చాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- ఇథనాల్, సెమీ కండక్టర్ల పరిశ్రమలను ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం

**అమరావతి (ప్రశ్న న్యూస్)** పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు చేరేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన 18వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ. 30,515 కోట్ల విలువైన 50 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. ఈ కంపెనీల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో 29,677 ఉద్యోగాలు రానున్నాయని అంచనా వేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, పరిశ్రమల స్థాపన కేవలం ధనికులకే సాధ్యమనే భావనను తొలగించి, సామాన్యులు కూడా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అనువైన వాతావరణం సృష్టించాలని స్పష్టం చేశారు.
ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ, "రాష్ట్రంలో పెద్ద ఎత్తున పారిశ్రామికాభివృద్ధి జరుగుతోంది. ఈ ఫలాలు పేద, మధ్య తరగతికి ఉద్యోగాల రూపంలోనే కాకుండా, వారు కూడా కంపెనీలు స్థాపించేలా ప్రోత్సహించాలి. స్టార్టప్‌లకు పెద్దపీట వేయాలి. దీనికోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టీఐహెచ్ (ఆర్టీఐహెచ్) సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని, వెంచర్ క్యాపిటలిస్టుల నుంచి పెట్టుబడులు ఆకర్షించాలి" అని దిశానిర్దేశం చేశారు.

2లో..

# రోడ్డు ప్రమాదాల పెరుగుదలలో తెలంగాణ టాప్

## - కేంద్రం నివేదికలో షాకింగ్ నిజాలు!



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** దేశంలోని ఇతర ప్రధాన రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో రహదారి ప్రమాదాలు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. 2023లో రాష్ట్రవ్యాప్తంగా 22,903 రోడ్డు ప్రమాదాలు నమోదు కాగా,

2లో..

## పవన్ కళ్యాణ్‌పై

# దేశద్రోహం కేసు పెట్టాలి

## - కవిత సంచలన డిమాండ్




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రజలను, ఉద్యమకారులను ఉగ్రవాదులు, వేర్పాటువాదులతో పోల్చిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై తక్షణమే దేశద్రోహం కేసు నమోదు చేయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభ ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిపై ఆమె తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక తెలంగాణ అస్తిత్వాన్ని,

2లో..

# రాయదుర్గం భూముల వేలం ప్రక్రియపై హైకోర్టు స్టే

## - ఎస్బీఐ పిటిషన్‌తో వేలానికి బ్రేక్




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగరంలోని రాయదుర్గంలో ఇటీవల రికార్డు ధర పలికిన అత్యంత ఖరీదైన భూముల వేలం ప్రక్రియపై తెలంగాణ హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. వేలం వేసిన భూమిలో కొంత భాగం తమదేనంటూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) దాఖలు చేసిన పిటిషన్‌తో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఉత్తర్వులతో హైదరాబాద్

2లో..

## ఎంపీపై

# థర్డ్ డిగ్రీనా.?

- రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు
- పార్లమెంట్‌పై దాడి చేసిన వాళ్లకూ, మీకూ తేడా ఏంటి?
- ఐపీఎస్ సునీల్ నాయక్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం!




**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి నిందితుడిగా ఉన్న సీనియర్

2లో..

## సాయికృష్ణ కుటుంబ సభ్యులను

# పరామర్శించిన జగన్

- మే నెల 9 నుంచి కనిపించకుండా పోయిన యువకుడు
- పోలీసులే లాకప్ డెత్ చేశారని కుటుంబం ఆరోపణలు
- సీబీఐ విచారణ జరిపించాలని వైఎస్ జగన్ డిమాండ్

**అమరావతి (ప్రశ్న న్యూస్)** విజయవాడకు చెందిన యువకుడు గాదె సాయికృష్ణ మిస్సింగ్ అంశం రాజకీయ మలుపు తీసుకుంది. కృష్ణలంకకు చెందిన సాయికృష్ణను పోలీసులే లాకప్‌లో కొట్టి చంపారనే ఆరోపణల నేపథ్యంలో ఏపీ రాజకీయం వేడెక్కింది. దీనిపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది.



ఈ క్రమంలో సాయికృష్ణ కుటుంబసభ్యులను మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరామర్శించారు. గురువారం మధ్యాహ్నం కృష్ణలంకలోని

2లో..

# 24 ఏళ్ల తర్వాత తెలుగు రాష్ట్రాల్లో ఓటర్ లిస్ట్ క్లీన్ అప్ డ్రైవ్!

## - మీ ఓటు భద్రమేనా?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బిగ్ అలర్ట్! మీరు ఆంధ్రప్రదేశ్ లేదా తెలంగాణలో ఓటరా? అయితే మీకో షాకింగ్ న్యూస్. గత 24 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర ఎన్నికల సంఘం తెలుగు రాష్ట్రాల్లో ఒక హిస్టారిక్ డెసిషన్ తీసుకుంది. ఎప్పుడో 2002-2004 కాలంలో జరిగిన స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్ ప్రక్రియను మళ్లీ ఇప్పుడు 2026లో అఫీషియల్‌గా రీ-స్టార్ట్ చేశారు. అంటే మీ ఓటర్ ఐడీ కార్డు కేవలం మీ జేబులో ఉంటే సరిపోదు, ఈ సరి కొత్త సర్వేలో మీ వివరాలు మ్యాచ్ అవ్వకపోతే మీ ఓటు లిస్ట్ నుంచి గల్లంతు కావడం ఖాయం. ఇది ఒక సాధారణ రొటీన్ అప్‌డేట్ కాదు. ఇదొక ఎలక్ట్రోరల్ ఎర్త్‌క్వేక్.



2లో..

# కిషన్ రెడ్డిపై రేవంత్ బీఆర్ఎస్ ముద్ర

ద్రోహి అనే నిందను తొలగించుకోవడానికి అయినా, కిషన్ రెడ్డి స్వయంగా చొరవ తీసుకుని దిల్లీ పెద్దలతో మాట్లాడి రాష్ట్రానికి ప్రాజెక్టులు, నిధులు తీసుకురావాల్సిన పరిస్థితిని రేవంత్ కల్పిస్తున్నారు.

### మెట్రో ఫేజ్-2 వివాదంలో రేవంత్ ప్లాన్ లో ఇరుక్కున్న కిషన్ రెడ్డి!

హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 విస్తరణ, ఐఆర్ఎఫ్సీ నుంచి రావాల్సిన రూ. 13,600 కోట్ల రీఫైనాన్సింగ్ లోన్, ఎన్ఓసీ వ్యవహారంలో ఈ వ్యూహం స్పష్టంగా కనిపించింది. మెట్రో ప్రాజెక్టు టేకోవర్, లోన్ మంజూరులో కొన్ని సాంకేతిక ఇబ్బందులు, కేంద్ర-రాష్ట్రాల మధ్య నిబంధనల పేచీలు వచ్చాయి. అయితే రేవంత్ రెడ్డి ఆ సాంకేతిక సాకులను పక్కనపెట్టి కిషన్ రెడ్డి స్వయంగా కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌లను కలిసి ఈ లోన్ రాకుండా అడ్డుకున్నారని, దీని వెనుక కేటీఆర్ కుట్ర ఉందంటూ సంచలన ఆరోపణలు చేశారు. దీనివల్ల సాంకేతిక లోపం కాస్తా, రాజకీయ వివాదంగా మారి.. కిషన్ రెడ్డి ఆ లోన్ క్లియర్ చేయించాల్సిన నైతిక ఒత్తిడిలోకి వెళ్లారు.

### లోన్ వచ్చినా, రాకపోయినా కాంగ్రెస్‌కే లాభం!

ఈ మైండ్ గేమ్‌లో రేవంత్ రెడ్డి విన్-విన్ పొజిషన్‌లో ఉన్నారు. ఒకవేళ రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణల ఒత్తిడికి లొంగి, కిషన్ రెడ్డి దిల్లీలో మాట్లాడి మెట్రో లోన్ ఎన్ఓసీ లేదా నిధులు ఇప్పించారనుకోండి చూశారా, మేము నిలదీస్తేనే దిల్లీ దిగొచ్చింది, ప్రాజెక్టు సాధించాం అని కాంగ్రెస్ క్రెడిట్ కొట్టేస్తుంది. అలా కాకుండా కేంద్రం మొండికేసి లోన్ ఆపేస్తే బీజేపీ, బీఆర్ఎస్ కలిసే హైదరాబాద్ అభివృద్ధిని, మెట్రో విస్తరణను అడ్డుకున్నాయి అని రాబోయే ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పొలిటికల్ మైలేజ్ సాధించవచ్చు. ఎలా చూసినా కిషన్ రెడ్డిని రేవంత్ తన వ్యూహాత్మక పద్మవ్యూహంలో బంధించేశారు. కేవలం మెట్రో మాత్రమే కాదు.. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు, రీజినల్ రింగ్ రోడ్ భూసేకరణ నిధుల విషయంలోనూ రేవంత్ రెడ్డి ఇదే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. గుజరాత్‌లోని సబర్మతి రివర్ ఫ్రంట్ ను అద్భుతంగా చెప్పుకునే బీజేపీ నేతలు, హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నారని రేవంత్ ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కిషన్ రెడ్డిని విలన్‌గా చిత్రీకరించడం ద్వారా కేంద్రం నుంచి రావాల్సిన క్లియరెన్స్‌లను వేగవంతం చేయడమే సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న అసలు దౌత్యం.

### కిషన్ రెడ్డి ముందున్న సవాల్

రేవంత్ రెడ్డి విసురుతున్న ఈ పొలిటికల్ గూగ్లీలను తిప్పికొట్టడం కిషన్ రెడ్డికి అంత సులభం కావడం లేదు. కేవలం నేను అడ్డుకోలేదు ఇవన్నీ సాంకేతిక సమస్యలు అని ప్రెస్ మీట్లు పెట్టి వివరణ ఇచ్చుకోవడం వల్ల ప్రజల్లోకి పూర్తి స్పష్టత వెళ్లడం లేదు. రేవంత్ రెడ్డి ప్లాన్ నుంచి కిషన్ రెడ్డి బయటపడాలంటే మాటల సమాధానం కంటే చేతల సమాధానమే ముఖ్యం. కేంద్ర మంత్రిగా తనకున్న పవర్‌తో తెలంగాణకు రావాల్సిన మెట్రో అనుమతులు, రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారుల నిధులను స్వయంగా దిల్లీ నుంచి తెచ్చి, రేవంత్ రెడ్డి కంటే ముందే తానే ప్రెస్ మీట్ పెట్టి ప్రకటించడం ద్వారానే కిషన్ రెడ్డి ఈ రాజకీయ చక్రబంధం నుంచి బయటపడగలరని అనుకోవచ్చు.

# రాజ్యసభ ఎన్నికల్లో సంచలనం

జార్ఖండ్‌లోని రెండు రాజ్యసభ స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. ఇందులో బీజేపీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల ఓట్లు, కాంగ్రెస్‌కు ఒక ఎమ్మెల్యే ఓటు చెల్లనిదిగా ఎన్నికల అధికారులు ప్రకటించారు.మిగిలిన 78 ఎమ్మెల్యే ఓట్లు చెల్లుబాటు అయినట్టుగా తేలింది. ఇందులో జేఎంఎం అభ్యర్థి వైద్యనాథ్ 30 ఓట్లు సాధించి రాజ్యసభకు ఎన్నికయ్యారు. అలాగే, మరో స్థానానికి ఎన్డీయే మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన పరిమల్ నత్వానీ 28 ఓట్లతో విజయం సాధించారు. 20 ఓట్లు పొందిన కాంగ్రెస్ అభ్యర్థి ప్రణవ్ ఓటమి చెందారు. దీంతో కాంగ్రెస్‌కు బిగ్ షాక్ తగిలింది. అయితే ఈ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరగడం పరిమల్ నత్వానీకి కలిసి రాగా అధికార కూటమిలో విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి.ఈ ఫలితాలపై కాంగ్రెస్ నాయకురాలు, మంత్రి దీపికా పాండే స్పందిస్తూ ద్రోహం జరిగిందని వ్యాఖ్యానించారు. ఇక, జార్ఖండ్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ కె రాజు మాట్లాడుతూ... తమ పార్టీ ఓటమికి కూటమి భాగస్వామ్య పక్షాలైన ఆర్జేడీ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ కారణమని ఆరోపించారు. "ఆర్జేడీ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్‌లు మాకు ద్రోహం చేశాయి. వారు మాకు ఓటు వేయలేదు, అందుకే మేము ఓడిపోయాము. మాకు జేఎంఎం నుంచి నాలుగు ఓట్లు లభించాయి. కాంగ్రెస్ శాసనసభ్యులందరూ మా అభ్యర్థికి అనుకూలంగానే ఓటు వేశారు" అని రాజు పీటీఐ వార్తా సంస్థతో చెప్పారు. ఈ ఫలితం కూటమి ఐక్యతపై ప్రభావం చూపుతుందా? అని అడిగినప్పుడు తాను ఈ విషయాన్ని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌తో చర్చిస్తానని రాజు అన్నారు.మరోవైపు బీజేపీ కోడెర్మా ఎమ్మెల్యే నీరా యాదవ్ "జై శ్రీరామ్, పని పూర్తయింది" అని పేర్కొన్నారు. ఇక, జార్ఖండ్ బీజేపీ అధ్యక్షుడు ఆదిత్య సాహు పరిమల్ నత్వానీ విజయం సాధించినందుకు ఆయనకు అభినందనలు తెలిపారు. శాసనసభ్యులు వారి మనస్సాక్షికి అనుగుణంగా ఓటు వేశారని అన్నారు. "మా పార్టీ రెండు ఓట్లు చెల్లనివి అయినప్పటికీ నత్వానీ 28 ఓట్లు సాధించారు. ఇది ఒక పెద్ద విజయం. మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఇండి కూటమిలోని సభ్యులు కూడా విశ్వాసం చూపించారు" అని ఆదిత్య సాహు అన్నారు. ఎమ్మెల్యేలను బీజేపీ ప్రలోభాలకు గురిచేసిందనే ఆరోపణలను తోసిపుచ్చారు.

# నాన్-సీరియస్ ప్లేయర్స్‌కు ఏపీలో చోటు లేదు

ప్రాజెక్టులకు అనుమతులు పొందాక వెంటనే పనులు ప్రారంభించని సంస్థల విషయంలో కఠినంగా వ్యవహరించాలని, 'నాన్-సీరియస్ ప్లేయర్స్'కు ఏపీలో చోటులేదని హెచ్చరించారు.

### ఇథనాల్, సెమీ కండక్టర్లకు పెద్దపీట

ఇథనాల్ ఆధారిత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించాలని, దీనివల్ల రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు ఇంధన దిగుమతుల భారం తగ్గుతుందని సీఎం అన్నారు. 40 శాతం ఇథనాల్ బ్లెండింగ్‌కు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో ఇథనాల్ తయారీ పరిశ్రమలను ప్రోత్సహించాలని సూచించారు. అదేవిధంగా, సెమీ కండక్టర్ల తయారీకి అవసరమైన ఎకోసిస్టమ్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, లిథియం అయాన్, ఫాస్ట్ ఛార్జింగ్ బ్యాటరీల ఉత్పత్తిని ప్రోత్సహించాలని ఆదేశించారు. రైతుల కోసం ప్రత్యేకంగా మైక్రో ఇరిగేషన్ ఎక్విప్‌మెంట్ పార్క్ ఏర్పాటు చేయాలని, దీనివల్ల రైతులకు తక్కువ ధరకే పరికరాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

### పర్యాటకం, మౌలిక వసతులపై దృష్టి

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేందుకు టెంపుల్ టూరిజం, బీచ్ టూరిజం అభివృద్ధి చేయాలన్నారు. సూర్యలంక బీచ్‌కు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని, హార్సిలీ హిల్స్‌లో మంచి రిసార్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. పురాతన స్వర్ణగిరిగా పేరున్న జొన్నగిరి గోల్డ్ మైన్ ఉత్పత్తిని వేగవంతం చేయాలన్నారు. పారిశ్రామిక ప్రాంతాల వద్ద కార్మికులకు అందుబాటు ధరల్లో గృహ నిర్మాణాలు చేపట్టాలని, ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను ఆటోమేషన్ చేసి రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పుట్టపర్తిలో 5వ తరం ఫైటర్ జెట్ తయారీ కేంద్రాన్ని వేగంగా పూర్తి చేయాలని, బెంగళూరు-పుట్టపర్తిని ఏరోస్పేస్, డిఫెన్స్ కారిడార్‌గా మార్చాలని ఆదేశించారు.

### ప్రాజెక్టులు ప్రారంభించాకే ప్రోత్సాహకాలు: మంత్రి లోకేశ్

ఈ సమావేశంలో పాల్గొన్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ కీలక సూచనలు చేశారు. భూ కేటాయింపులు పొందిన కంపెనీలు ప్రాజెక్టులను ప్రారంభించిన తర్వాతే ప్రోత్సాహకాలు, రాయితీలు అమలు చేయాలని స్పష్టం చేశారు. "ప్రాజెక్టులు వేగంగా ప్రారంభమైతేనే జీఎస్టీ రూపంలో రాష్ట్రానికి ఆదాయం వస్తుంది. అప్పుడు ప్రోత్సాహకాలు ఇవ్వడం సమంజసంగా ఉంటుంది" అని అభిప్రాయపడ్డారు. స్థానిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని, ఆంధ్రా యూనివర్సిటీలో రేర్ ఎర్త్ మినరల్స్‌పై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# స్విస్ బ్యాంకుల్లో తగ్గిన భారతీయుల నిధులు

చెంది 524 మిలియన్ ఫ్రాంకులకు (సుమారు రూ. 6,000 కోట్లు) చేరడం గమనార్హం. అయితే, మొత్తం నిధుల్లో వీటి వాటా కేవలం 16 శాతం మాత్రమే. స్థానిక శాఖలు, ఇతర ఆర్థిక సంస్థల ద్వారా ఉన్న నిధులు తగ్గడమే మొత్తం తగ్గుదలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది.దేశంలో నల్లధనంపై చర్చ జరిగిన ప్రతిసారీ స్విస్ బ్యాంక్ గణాంకాలపై ప్రత్యేక ఆసక్తి నెలకొంటుంది. అయితే, ఈ డేటాలో అక్రమ నిధుల వివరాలు ఉండవని, ఇది కేవలం స్విస్ బ్యాంకుల మొత్తం బాధ్యతలను మాత్రమే సూచిస్తుందని ఆ బ్యాంకు స్పష్టం చేసింది. 'ఆటోమేటిక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్' ఒప్పందం కారణంగా భారత్, స్విట్జర్లాండ్ మధ్య ఆర్థిక సమాచార మార్పిడిలో పారదర్శకత గణనీయంగా పెరిగింది. స్విస్ బ్యాంకుల్లో అత్యధిక నిధులు కలిగి ఉన్న దేశాల జాబితాలో భారత్ 46వ స్థానంలో నిలవగా.. యూకే, అమెరికా, ఫ్రాన్స్ దేశాలు అగ్రస్థానాల్లో ఉన్నాయి. ఇదే క్రమంలో, స్విస్ బ్యాంకుల్లోని మొత్తం విదేశీ నిధులు కూడా 8 శాతం మేర తగ్గి 1.05 ట్రిలియన్ ఫ్రాంకులకు చేరుకున్నాయి.

# ఎవరేమనుకున్నా మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతాం

వనమహోత్సవంలో భాగంగా పలు జిల్లాల్లో మొక్కలు నాటడం, వనాల పెంపుతో పాటు వన్య ప్రాణుల సంరక్షణ, ప్రకృతి సంరక్షణకు సంబంధించి రూ.35.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో రూ. 17.84 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే, నిజామాబాద్, కొత్తగూడెం, హనుమకొండ, మెదక్, మహబూబ్‌నగర్, ములుగు, నారాయణపేట, భూపాలపల్లి, సంగారెడ్డి, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో రూ. 17.66 కోట్ల విలువైన అర్బన్ పార్కులు, ఎకో పార్కులు, వన్యప్రాణి సంరక్షణ, జూ ఆధునీకరణ, నివాస భవనాలు, పర్యావరణ మౌలిక సదుపాయాల వంటి అభివృద్ధి పనులను ఇక్కడి నుంచే సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోని ఢిల్లీ, ముంబయ్, బెంగుళూరు లాంటి మహానగరాలు ఎదుర్కొంటున్న కాలుష్యం, వరదల వంటి దుస్థితి హైదరాబాద్ నగరానికి రాకూడదన్న సంకల్పంతో పని చేస్తున్నామని చెప్పారు. దేశంలోని మహానగరాలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించిన ఆయన హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయిలో మూసీ రివర్ ఫ్రంట్ నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు."ఎవరేమనుకున్నా మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతాం. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి. మీ మేరకు అంతర్జాతీయ స్థాయిలో రివర్‌ఫ్రంట్ పూర్తి చేసే బాధ్యత నాది. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తాం. సబర్మతీ, గంగా, యమునా నదుల రివర్‌ఫ్రంట్ల కన్నా అద్భుతంగా మూసీ రివర్‌ఫ్రంట్‌ను అభివృద్ధి చేస్తాం. గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఏ పనులు చేయాలన్నా ఒక ప్రాంతం వైపు మాత్రమే చేపట్టారు. కూతవేటు దూరంలో ఉన్న ఎల్బీనగర్, బీఎన్ రెడ్డి నగర్, వనస్థలిపురం, హయత్ నగర్, గుర్రంగూడ, బైరామల్ గూడ, సాయబ్ నగర్ లాంటి ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదు" అని రేవంత్ రెడ్డి అన్నారు.ఈ విషయాలపై ఆలోచన చేసి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలలోని ఈ ప్రాంతాలవైపు అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో పనులు చేపట్టామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అందులో భాగంగానే రూ. 2,400 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్రూట్ మార్కెట్ నిర్మిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. గుర్రంగూడ స్థలాన్ని కూడా కబ్జా చేయాలని, కొందరు ప్రైవేటు వ్యక్తులు స్థలాన్ని లేఅవుట్ చేసి విక్రయించాలని ప్రయత్నిస్తే సుప్రీంకోర్టులో బలంగా వాదించి రక్షించుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందులో నేషనల్ పార్క్ కోసం వంద ఎకరాలను కేటాయించామని చెప్పారు. ఎల్బీ నగర్ ప్రాంతంలో 424 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పార్క్‌ను నిర్మించడానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించానని అన్నారు. కబ్జాలు, ఆక్రమణల కారణంగా వర్షపు నీరు వెళ్లడానికి వీలులేక వర్షాలొచ్చినప్పుడు బస్తీలకు బస్తీలు నీట మునిగాయని అన్నారు. అలాంటి కష్టాలు రావొద్దన్న ఉద్దేశంతోనే కబ్జాల కోరలు పీకాలని హైడ్రాను తీసుకొచ్చామని చెప్పారు. చెరువులు, పార్కులు, నాలాలు కబ్జా చేస్తే హైడ్రా కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. కొద్ది మంది కబ్జాలకు పాల్పడటం వల్ల వేలాది కుటుంబాల కష్టాలను ఎదుర్కొనే పరిస్థితిని ఉపేక్షించబోమని అన్నారు. గతంలో సీరీస్ ఫ్యాక్టరీ వల్ల ఎల్బీ నగర్ నియోజకవర్గ ప్రాంత ప్రజలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారని గుర్తుచేశారు.

# రోడ్డు ప్రమాదాల పెరుగుదలలో తెలంగాణ టాప్

2024 నాటికి ఆ సంఖ్య 25,986కి చేరింది. కేవలం ఏడాది కాలంలోనే ప్రమాదాల సంఖ్య 13.5 శాతం పెరగడం గమనార్హం. ఇది జాతీయ సగటు వృద్ధి రేటు (1.5 శాతం) కంటే చాలా రెట్లు అధికంగా ఉండటం గమనార్హం. ఈ ప్రమాదాల్లో కారణంగా సంభవిస్తున్న మరణాల సంఖ్య సైతం భారీగానే ఉంది. 2024లో రాష్ట్రంలో జరిగిన వివిధ ప్రమాదాల్లో సుమారు 7,900 మంది ప్రాణాలు కోల్పోయారు. మరణాల వృద్ధి రేటు (3.7 శాతం) దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాల్లో కంటే తెలంగాణలోనే అత్యధికంగా నమోదైంది.ఈ ప్రమాదాలకు ప్రధాన కారణంగా మితిమీరిన వేగాన్ని అధికారులు గుర్తించారు. ఒక్క అతివేగం వల్లే 7,500 కంటే ఎక్కువ ప్రమాదాలు జరగ్గా, సుమారు 2,760 మంది మృత్యువాత పడ్డారు. వీటితో పాటు హిట్ అండ్ రన్ కేసులు, వాహనాలను వెనుక నుంచి లేదా పక్క నుంచి ఢీకొట్టడం వంటి ఘటనల కూడా వేలాది మంది మరణాలకు కారణమవుతున్నాయి. అయితే, ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరగడంపై రవాణా శాఖ (ఆర్టీఏ) అధికారులు భిన్నమైన వాదన వినిపిస్తున్నారు. గతంలో నమోదు కాని చిన్న చిన్న ప్రమాదాలను కూడా ప్రస్తుతం రికార్డు చేస్తుండటం వల్లే గణాంకాలలో ఈ పెరుగుదల కనిపిస్తోందని వారు చెబుతున్నారు.రహదారి భద్రతను మెరుగుపరిచేందుకు ఇప్పటికే జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తద్వారా రోడ్ల ఇంజినీరింగ్ లోపాలను సరిదిద్దడం, నిబంధనల అమలును కట్టుదిట్టం చేయడం మరియు ప్రమాద సమయాల్లో తక్షణ అత్యవసర స్పందన వంటి చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ఎంపీపై థర్డ్ డిగ్రీనా.?

ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన ఏపీ హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "దేశ సర్వోన్నత చట్టసభ అయిన పార్లమెంట్‌పై దాడి చేసిన వ్యక్తులకు అదే పార్లమెంట్‌లో సభ్యుడిగా (ఎంపీగా) ఉన్న వ్యక్తిని కస్టడీలోకి తీసుకుని థర్డ్ డిగ్రీతో దారుణంగా వేధించిన వారికి మధ్య పెద్ద తేడా ఏముంది?" అని జడ్జి సూటిగా ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక ప్రజాప్రతినిధిపై కస్టోడియల్ టార్చర్ ఆరోపణలు రావడం అత్యంత తీవ్రమైన విషయమని కోర్టు పేర్కొంది. ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి అయి ఉండి ఇలాంటి అరాచక సంఘటనల్లో భాగస్వామి కాకుండా తనను తాను నియంత్రించుకోవాల్సిన కనీస బాధ్యత లేదా అని నిలదీసింది.ఎంపీ రఘురామకృష్ణంరాజును వేధింపులకు గురిచేయబోతున్నారనే విషయం సునీల్ కుమార్ నాయక్ కు ముందే తెలుసని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ మొత్తం వ్యవహారంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆయన కీలక పాత్ర పోషించినట్లు ప్రాథమికంగా ఆధారాలు కనిపిస్తున్నాయని కోర్టు స్పష్టం చేసింది. ఒక ఎంపీపై కస్టోడియల్ టార్చర్ వంటి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారికి ముందస్తు బెయిల్ రక్షణగా మారకూడదని కోర్టు తేల్చిచెప్పింది. సునీల్ కుమార్ నాయక్ తరఫు లాయర్‌ను ఉద్దేశించి 'మీ క్లయింట్ ఎప్పటిలోగా పోలీసుల ఎదుట సరెండర్ అవుతారు?' అని ప్రశ్నించింది. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొనసాగిస్తారా? లేక చట్టాన్ని గౌరవించి స్వచ్ఛందంగా వెళ్లి లొంగిపోతారా? అనేది తేల్చుకోవాలని ఆదేశించింది.హైకోర్టు వ్యాఖ్యలపై పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ కోర్టు అడిగిన ప్రశ్నలపై తమ క్లయింట్ తో సంప్రదించి తదుపరి నిర్ణయాన్ని న్యాయస్థానానికి తెలియజేస్తామని చెప్పారు. కేసుకు సంబంధించిన మరికొన్ని కీలక అంశాలను కోర్టు ముందు ఉంచుతామని కోరారు. దీంతో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఎలాంటి తుది తీర్పు ఇవ్వకుండా, హైకోర్టు ఈ కేసు విచారణను రేపటికి వాయిదా వేసింది.

# సాయికృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించిన జగన్

అతడి ఇంటికి వెళ్లిన మాజీ సీఎం జగన్ సాయికృష్ణ తల్లిని ఓదార్చారు. ఆమెతో మాట్లాడి, ధైర్యం చెప్పిన జగన్ అన్ని విధాలుగా కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.అనంతరం అక్కడ జగన్ మీడియాతో మాట్లాడుతూ "విజయవాడ నడిబొడ్డున దారుణం జరిగింది చంద్రబాబు ప్రోత్సహిస్తున్న కొందరు పోలీసుల వల్లే ఇలా జరుగుతోంది ఒక సీఐ స్టేషన్ పరిధిలో నెలలో రెండు చావులు మే 9 నుంచి సాయికృష్ణ తల్లి తల్లడిల్లిపోతోంది, సాయికృష్ణ ఘటనపై సీబీఐ విచారణ జరగాలి సీఐ సస్పెన్షన్ కేవలం కంటితుడుపు చర్య మాత్రమే సీఐను అరెస్ట్ చేయకుండా సాయి తల్లితో బేరాలాడుతారా? పోలీసులు, జనసేన నాయకులు ఆమెను ప్రలోభపెడుతున్నారు ఏసీపీ, సీపీ సహా అందరి పాత్ర తేలాలి" అని డిమాండ్ చేశారు

.గత నెల నుంచి సాయికృష్ణ జాడ కనిపించకపోవడంతో దీని వెనుక పోలీసులు ఉన్నారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తమ బిడ్డను పోలీసులే ఏదో చేశారని సాయికృష్ణ తల్లి ఆరోపించారు. పోలీస్ స్టేషన్‌లో పోలీసులే అతడ్ని కొట్టి చంపారని మాజీ మంత్రి అంబటి రాంబాబు సహా వైసీపీ నేతలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఈ అంశంపై జాతీయ మానవహక్కుల కమిషన్‌కు విజయవాడ మాజీ ఎంసీ, వైసీపీ నేత కేశినేని నాని ఫిర్యాదు చేశారు. అలాగే, లోక్‌భవన్‌కు వెళ్లిన వైసీపీ నేతలు డీఎస్పీతో పాటు సాయికృష్ణ అంశంపై గవర్నర్‌కు వినతిపత్రం అందజేశారు.కాగా, మే 9న మార్కాపురం నుంచి తమ బిడ్డను పోలీసులు తీసుకెళ్లారని, అప్పటి నుంచి ఇంటికి రాలేదని, గాలిస్తున్నామని కుటుంబసభ్యులు చెబుతున్నారు.

తమ బిడ్డ ఏమయ్యాడో అని పోలీసులను అడిగితే 'నీ కొడుకు ఇక లేడనుకో' అంటూ సీఐ నాగరాజు సమాధానమిచ్చారని తెలిపారు. మరోవైపు, సాయికృష్ణ తల్లి హైకోర్టును ఆశ్రయించి, హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు జూన్ 29 లోపు సాయికృష్ణను తమ ముందు హాజరుపర్చాలని పోలీసులను ఆదేశించింది.ఇక, సాయికృష్ణ మిస్సింగ్ వెనుక సీఐ నాగరాజు ఉన్నారని ఆరోపణలు రావడంతో ఆయనను సస్పెండ్ చేశారు. మరోవైపు, ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు తీవ్రంగానే స్పందించారు. ఐపీఎస్ అధికారితో దర్యాప్తు చేయాలని ఆదేశించారు. నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

రెండు రాష్ట్రాల్లో కలిసి లక్షలాది మంది ఓట్లపై ప్రస్తుతం సందిగ్ధత నెలకొంది. దాదాపు లక్షల మంది ఓట్లు డేంజర్ జోన్‌లో పడ్డాయంటే పరిస్థితి ఎంత సీరియస్‌గా ఉందో అర్థం చేసుకోవచ్చు. భారీ సంఖ్యలో అన్‌మ్యాప్డ్ ఓటర్లను అధికారులు గుర్తించారు. అసలు ఈ 24 ఏళ్ల తర్వాత వచ్చిన ఈ సవరణ ఏంటీ ఎందుకు ఈ ప్రక్రియ చేపట్టింది? ఓటు కాపాడుకోవాలంటే ఏం చేయాలో చూద్దాం.

### అసలు ఏంటీ ఈ సర్

సాధారణంగా ఎన్నికల సంఘం ప్రతి ఎన్నికల ముందు ఓటర్ల జాబితాను సవరిస్తుంది. దీనిని సమ్మరీ రివిజన్ అంటారు. కానీ గత రెండు దశాబ్దాలుగా ఓటర్లు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్లడం, చనిపోయిన వారి పేర్లు అలాగే ఉండిపోవడం, ఒక వ్యక్తికి రెండు మూడు ప్రాంతాల్లో ఓటు హక్కు ఉండటం వల్ల డేటాబేస్ గందరగోళంగా మారింది. దీనిని ప్రక్షాళన చేసేందుకు 2002లో చివరిసారిగా దేశవ్యాప్తంగా సర్ నిర్వహించారు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు ఇంత పెద్ద ఎత్తున సమగ్ర గ్రౌండ్ లెవెల్ సర్వే చేపడుతున్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ప్రక్రియ పూర్తి చేసింది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో అధికారులు సర్వే ప్రారంభించారు. ప్రస్తుతం 2026లో ఎన్నికల సంఘం 2002 ఎలక్టోరల్ రోల్‌ను కీ రిఫరెన్స్‌గా తీసుకొని ఇప్పటి 2026 డేటాతో కంప్యూట్, మాన్యువల్ మ్యాపింగ్ చేస్తోంది.

### 30శాతం మిస్‌మ్యాచ్- డేంజర్ జోన్‌లో ఓట్లు

ఎన్నికల సంఘం అధికారులు ప్రాథమికంగా జరిపిన మ్యాపింగ్‌లో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. 2002 జాబితాతో ప్రస్తుత ఓటర్ల జాబితాను కంపేర్ చేయగా తెలుగు రాష్ట్రాల్లో 30 శాతం మంది మిస్ మ్యాచ్ అయ్యారు. ఒక్క తెలంగాణలోనే దాదాపు రెండు కోట్ల ఓట్లు అన్‌మ్యాపింగ్, లోపాలు ఉన్నట్టు గుర్తించారు. డూప్లికేట్ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లను వంద శాతం పారదర్శకంగా తొలిగించడమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశం.

### మీ ఇంటికే రానున్న బీఎల్‌వోలు

ఈ సవరణ కోసం ఎన్నికల సంఘం క్షేత్రస్థాయిలో భారీ సైన్యాన్ని రంగంలోకి దించింది. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 46,397 మంది తెలంగాణలో వేలాది మంది బూత్‌లెవల్ ఆఫీసర్స్‌ను నియమించారు. వారంతా ఇంటికి వచ్చి వివరాలు సేకరిస్తారు. మీ వద్దకు వచ్చే బీఎల్‌వోలు ప్రత్యేకమైన యునిక్ ఎన్యూమరేన్ పామ్ తీసుకొస్తారు. ఇందులో మీ ప్రస్తుత వివరాలు ప్రింట్ అయి ఉంటాయి. ఒక వేళ మీరు మొదటి విజిట్‌లో ఇంట్లో లేకపోతే, బీఎల్‌వోలు కనీసం మూడుసార్లు మీ ఇంటికి వచ్చి మిమ్మల్ని కలవడానికి ప్రయత్నిస్తారు. మీ 2002నాటి ఓటు వివరాలతో ప్రస్తుత వివరాలు లింక్ కాకపోతే, మీకు ఈఆర్ఓలు నుంచి అధికారికంగా నోటీసులు వస్తాయి. అప్పటికీ స్పందించకపోతే మీ ఓటు తొలగిస్తారు.

### 2002లో మీ ఓటు ఎక్కడ ఉందో ఎలా తెలుసుకోవాలి?

ఈ సర్ మ్యాపింగ్ ప్రక్రియలో అర్బన్ ఓటర్లు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఎన్నికల సంఘం ఆన్‌లైన్ సదుపాయాన్ని కల్పించింది. సిటిజన్ సర్వీస్ పోర్టల్ ద్వారా మీరు మీ పాత రికార్డులను వెతకవచ్చు. ఇంటర్నెట్ బ్రౌజర్‌లో అధికారిక వెబ్‌సైట్ ఓపెన్ చేసి లాగిన్ అవ్వండి. హోంపేజీలో నిపిస్తున్న సెర్చ్ యువర్ నేమ్ ఇన్ లాస్ట్ సర్ అనే ఆప్షన్‌ను క్లిక్ చేయండి. మీ రాష్ట్రం, జిల్లా, 2002లో మీరు ఏ నియోజకవర్గంలో ఉన్నారో ఆ వివరాలను ఎంటర్ చేయండి. మీ పేరు, నియోజకవర్గం, పోలింగ్ కేంద్రం నంబరు వంటి వివరాలు వస్తాయి. ఆ వివరాలను మీ ఏరియా బీఎల్‌వోకి అందిస్తే మ్యాపింగ్ విజయవంతం అవుతుంది. ఈ ప్రక్రియ షెడ్యూల్‌ను ఎలక్షన్ కమిషన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. జూన్ 15 నుంచి ప్రారంభమైన ఈ సుదీర్ఘ ప్రక్రియ అక్టోబర్ నాటికి ముగిసి, సరికొత్త ప్యూరిఫైడ్ ఓట్ లిస్ట్ బయటకు రానుంది.

# పవన్ కళ్యాణ్‌పై దేశద్రోహం కేసు పెట్టాలి

ఉద్యమ ఆనవాళ్లను ఉద్దేశపూర్వకంగానే పక్కన పెడుతున్నారని ఆమె ఆరోపించారు.

### తెలంగాణను అవమానించిన 'సినిమా స్టార్'.. కేసులేవీ?

జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజునే ఒక సినిమా నటుడు ఇక్కడ సభ పెట్టి, తెలంగాణ వాదాన్ని వేర్పాటువాదంతో పోల్చడం దుర్మార్గమన్నారు. మనం ఎప్పుడైనా దేశం నుంచి వేరవుతామన్నామా? రాజ్యాంగబద్ధంగా ప్రత్యేక రాష్ట్రం కోరుకుంటే వేర్పాటువాదులంటారా? ఆ తలకాయ లేని సినిమా స్టార్‌పై దేశద్రోహం కేసు పెట్టేందుకు ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదు. అదే మేము సింగరేణి కార్మికుల కోసం, ప్రజా సమస్యలపై సచివాలయం ముందు ధర్నా చేస్తే మాత్రం మాపై కేసులు పెడతారు" అని మండిపడ్డారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యల వెనుక మళ్లీ తెలంగాణపై పక్క రాష్ట్రం పెత్తనం తెచ్చే కుట్రలు దాగున్నాయని హెచ్చరించారు.

### తెలంగాణ తల్లి, కాకతీయ చిహ్నాలపై రేవంత్ దాడి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తెలంగాణ భావజాలంపై దాడి చేస్తున్నారని కవిత ఆరోపించారు. రాచరిక పోకడలంటూ రాష్ట్ర చిహ్నం నుంచి కాకతీయుల కళాతోరణాన్ని తీసేశారని, చార్మినార్, పూర్ణకుంభాన్ని కూడా తొలగించే ప్రయత్నం చేశారని విమర్శించారు. అంతేకాకుండా, సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టారని దుయ్యబట్టారు. కొత్తగా రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహం చేతిలో బతుకమ్మ లేకుండా చేసి, ఉద్యమ కాలం నాటి ఆనవాళ్లను గూగుల్‌లో కూడా దొరకకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో 2009లో పెట్టుకున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా స్మార్ట్ సిటీ పనుల పేరుతో తొలగించి ఇంకా పునరుద్ధరించలేదని మండిపడ్డారు.

### రవీంద్రభారతిలో మనోళ్లను కాదని ఆంధ్రా విగ్రహాలా?

తెలంగాణ కళాకారుల అడ్డాయైన రవీంద్రభారతిలో తెలంగాణేతరుడైన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని పెట్టడాన్ని కవిత తప్పుపట్టారు. బాలసుబ్రహ్మణ్యం విగ్రహం పెట్టాలనుకుంటే ఏ ఫిల్మ్ సిటీలోనో, థియేటర్లలోనో పెట్టుకోవాలే తప్ప రవీంద్రభారతిలో కాదన్నారు. మన గద్దరన్న పేరుతో సినిమా అవార్డులు ఇవ్వడం ఏంటని, ఆయనకు సినిమాలతో ఏం సంబంధమని ప్రశ్నించారు. గద్దర్ పేరిట జానపద అకాడమీ పెట్టాలే తప్ప, ఇలా సినిమా అవార్డులు ఇవ్వడం ఆయనను అవమానించడమేనన్నారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత కూడా సచివాలయం వద్ద జయశంకర్ సార్ విగ్రహం కోసం, అసెంబ్లీలో మహాత్మా పూలే విగ్రహం కోసం పోరాడాల్సి రావడం అత్యంత ఆవేదన కలిగిస్తోందన్నారు.

### నెలలు గడిచినా ఉద్యమకారులకు శూన్యం

జార్ఖండ్ వంటి రాష్ట్రాలు తమ ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి రైల్వే, బస్సు ప్రయాణాల్లో డిస్కౌంట్లు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తుంటే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం 30 నెలలు గడుస్తున్నా ఉద్యమకారులను గుర్తించడంలో కనీస చలనం లేకుండా వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు. గతంలో 1,200 మంది అమరులను బీఆర్ఎస్ పట్టించుకోలేదని ఆడిపోసుకున్న కాంగ్రెస్, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని ధ్వజమెత్తారు. ఈ ప్రజావ్యతిరేక ప్రభుత్వంపై తాము చాలా సీరియస్‌గా కొట్లాడాల్సి ఉందని, భవిష్యత్ కార్యాచరణపై ఉద్యమకారులు దిశానిర్దేశం చేయాలని కోరారు. తన నేతృత్వంలోని పసికూన లాంటి కొత్త రాజకీయ వేదికను ముందుకు నడిపేందుకు అందరి సలహాలు, సూచనలు కావాలని కవిత ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు

## రాయదుర్గం భూముల వేలం

# ప్రక్రియపై హైకోర్టు స్టే

రియల్ ఎస్టేట్ రంగంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఈ లావాదేవీపై సందిగ్ధత నెలకొంది. రాయదుర్గం పాన్‌మక్తాలోని నాలెడ్జ్ సిటీ పరిధిలోని సర్వే నంబర్ 83/1లో ఉన్న భూమిని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ఈ-వేలం వేయడాన్ని సవాలు చేస్తూ ఎస్బీఐ కోర్టును ఆశ్రయించింది.

ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ విచారణ చేపట్టారు. సుమారు 5 ఎకరాల భూమికి సంబంధించిన ఈ వివాదంలో మూడు వారాల పాటు వేలం మరియు తదనంతర ప్రక్రియలను నిలిపివేయాలని ఆయన ఆదేశించారు. ఈ మేరకు టీజీఐఐసీ, ఎస్బీఐతో పాటు వేలంలో భూమిని దక్కించుకున్న గౌరా వెంచర్స్‌కు కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేశారు.టీజీఐఐసీ మే 28న నిర్వహించిన వేలంలో 6.29 ఎకరాల భూమి ఎకరానికి రూ. 237 కోట్ల రికార్డు ధర పలికి, మొత్తంగా సుమారు రూ. 1,490 కోట్లను ఆర్జించింది.

అనంతరం జూన్ 1న జరిగిన మరో వేలంలో 5.09 ఎకరాల భూమి ఎకరానికి రూ. 204 కోట్ల చొప్పున రూ. 1,038 కోట్లకు విక్రయించబడింది. వివాదంలో ఉన్న 5 ఎకరాల భూమిని 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమకు కేటాయించిందని, దీని కోసం అప్పట్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ఎస్బీహెచ్) రూ. 13.33 కోట్లు చెల్లించిందని ఎస్బీఐ తన పిటిషన్‌లో పేర్కొంది. అయితే, ఆ తర్వాత ప్రభుత్వం కేటాయింపులను రద్దు చేయగా, దానిపై న్యాయపోరాటం కొనసాగుతున్నప్పటికీ టీజీఐఐసీ వేలం నిర్వహించడం సరికాదని వాదించింది. ప్రస్తుతం ఈ కేసులో తదుపరి విచారణను హైకోర్టు వాయిదా వేసింది.

## అంతేరా రెస్టారెంట్, లా పినోజ్ పిజ్జా
# రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడి



**హైదరాబాద్** మియాపూర్లోని మదీనాగూడలో ఉన్న అంతేరా రెస్టారెంట్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చే'ఇఐఎ. ఫంగస్ ఏర్పడిన కాలీఫ్లవర్ ఇతర కూరగాయలు, వంటకు వాడరాని నూనె, లేబుల్స్ లేకుండా కూరగాయల నిల్వలు గుర్తించి ఇంప్రూవ్మెంట్ నోటీసులు జారీ చేసారు. హైటెక్ సిటీ జూబ్లీ ఎంక్లేవ్లోని లా పినోజ్ పిజ్జా రెస్టారెంట్పై దాడులు చేసి ఫ్రిజ్లో పురుగులు, కిచెన్లో బొద్దింకలు, వెజ్ మరియు నాన్ వెజ్ పదార్థాలు ఒకే చోట నిల్వ ఉంచడం, ఆహార పదార్థాలు నిల్వ ఉంచే చోట బల్లి విసర్జనలు ఉన్నట్లు గుర్తిం,ఆరు. నోటీసులు జారీ చేసారు.

## ఆక్వా రైతు కృష్ణంరాజు దారుణ హత్య

**ముమ్మిడివరం,** కొత్త మురమళ్లలో రొయ్యల చెరువు వద్ద ఆక్వా రైతు దాట్ల కృష్ణంరాజు (64)ను దుండగులు కొట్టి చంపి, రాళ్లు కట్టి రొయ్యల చెరువులో పడవేసారు. రాత్రి అయినా కృష్ణంరాజు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. చివరకు చెరువులో రాళ్లుతో కట్టిపడేసిన కృష్ణంరాజు మృతదేహం గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు గురైన వ్యక్తి స్థానిక ఎమ్మెల్యే సమీప బంధువని సమాచారం.

## గోడ కూలి కారులో ఉన్న ఇద్దరు మృతి

**మహబూబ్ నగర్** వర్షం కురుస్తున్న సమయంలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిపై నుంచి ప్రహరీ గోడ కారుపై అకస్మాత్తుగా కూలిపోయింది. ఘటనలో కారులో ఉన్న సివిల్ ఇంజినీర్ జగన్నాథ్ రెడ్డి, డ్రైవర్ సంతోష్ మృతి చెందారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండల కేంద్రంలో ఘటన జరిగింది.

## మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

**- మామిడి రైతులకు మద్దతుగా వైసీపీ ఆధ్వర్యంలో ఆందోళన**

**చిత్తూరు** జీడి నెల్లూరు జైన్ ఫ్యాక్టరీ ఎదుట మామిడి రైతులతో వైసీపీ నిరసన కు దిగింది. మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేసారు. గత ఏడాది మామిడి పంటకు కిలో 12 రూపాయలు గిట్టు బాటు ధర కల్పించింది ప్రభుత్వం. ఈ ఏడాది మామిడి పంటను జ్యూస్ ఫ్యాక్టరీలు తక్కువ ధరకే కిలో 4 - 5 రూపాయలు మించి కొనుగోలు చేయడంలేదు. తోతాపురి మామిడి పంటకు కిలో 15-20 రూపాయలు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేసారు. తిరుపతి , చిత్తూరు జిల్లాలు వైసీపీ అధ్యక్షుడు భూముల కరుణాకర్ రెడ్డి నేతృత్వంలో జైన్ ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన జరిగింది.

## పోలీసుల వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య



**విజయనగరం** సంతకవిటి మండలం రామరాయపురంలో విషాదం నెలకొంది. పోలీసుల పలుమార్లు విచారణకు పిలవడంతో తల్లీకొడుకులు కళావతి, చిరంజీవి రైలు క్రిందపడి ఆత్మహత్యకు ప్రయత్నించారు. ఆఖరి క్షణంలో కొడుకును పక్కకునెట్టి తల్లి ఆత్మహత్య చేసుకుంది.గత నెల 25న ఓ ఇంట్లో 4 తులాల బంగారం, రూ.10 వేల నగదు చోరీ అయ్యాయి. అనుమానంతో వీరినే పదే పదే పోలీస్ స్టేషన్ కు పిలవడంతో మనస్తాపానికి గురయ్యారు.

## రోడ్డు ప్రమాదంలో
# తల్లిదండ్రులు, కొడుకు మృతి

**మెడ్చల్** మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మురహరపల్లి రాజీవ్ రహదారిపై అర్ధ రాత్రి జరిగిన ప్రమాద ఘటన స్థలాన్ని మేడ్చల్ ఏసిపి శంకర్ రెడ్డి పరిశీలించారు.ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే.ఈ ప్రమాదంలో కరీంనగర్ కు చెందిన రైల్వే ఉద్యోగి చంద్ర శేఖర్ మరియు అతని భార్య రేఖ మరియు రేఖ చెల్లెలి కుమారుడు నిహాల్ 2 సంవత్సరాలు ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో కారు అదుపు తప్పి అటుగా వస్తున్న లారీని బలంగా ఢీ కొనడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ముగ్గురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు.ఈ ప్రమాదానికి నిద్ర మత్తె కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు.మృతులను పోస్ట్ మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించామని ఏసీపీ మీడియాకు తెలిపారు..

# రైతులకు రెండు లక్షల పంట రుణాలు మాఫీ చేయాలి

**- జూన్ 30 చలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయండి**

**- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు మందపాటి రమణారెడ్డి**



**పిడుగురాళ్ల** :రైతులకు రెండు లక్షల పంట రుణాలు మాఫీ చేయాలని జూన్ 30వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మందపాటి రమణారెడ్డి అన్నారు. గురువారం పిడుగురాళ్ల ఎస్ టి యూ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సమావేశంలో రమణారెడ్డి మాట్లాడుతూ, గత రెండేళ్లుగా రాష్ట్రంలో రైతాంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా మన రాష్ట్రంలో రెండు లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి ఆత్మహత్యల నుంచి రైతాంగాన్ని కాపాడాలని అన్నారు. గురజాల నియోజకవర్గం కార్యదర్శి కందిమళ్ల సైదారావు మాట్లాడుతూ, డాక్టర్ ఎం ఎస్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని కౌలు రైతులకు గుర్తింపు కార్డులను ఇచ్చి, పంట రుణాలను ఇవ్వాలన్నారు. విజయవాడలో జరుగు ధర్నా చౌక్ వద్దకు ఈ నెల 30వ తేదీన గురజాల నియోజకవర్గం నుంచి రైతులు పాల్గొని ముఖ్యమంత్రి కార్యాలయం రాయబారాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు కందిమళ్ళ అంజలి, అక్కెనపల్లి బాలయ్య, షేక్ సైదా, షేక్ నజీర్ పాల్గొన్నారు.

## విజయవాడ లాకప్ డెత్ ఉదంతంపై
## ఎన్హెచ్ఆర్సీ కి మాజీ ఎంపీ కేశినేని నాని ఫిర్యాదు

**విజయవాడ** థర్డ్ డిగ్రీ గాయాలు బయటపడకుండా ఉండేందుకే గాదె సాయికృష్ణ మృతదేహాన్ని పోలీసులు రహస్యంగా దహనం చేశారని మాజీ ఎంపి కేశినేని నాని ఆరోపించారు. ఈ మేరకు అయన జాతీయ మానవ హక్కుల సంఘానికి అయన ఫిర్యాదు చేసారు. ఫోరెన్సిక్, డిఎన్యే ం సాక్ష్యాలు దొరకకుండా ఉండేందుకు, సాయికృష్ణ అస్థికలను కృష్ణానదిలో కలిపేశారని అన్నారు.'కమాండ్ రెస్పాన్సిబిలిటీ' కింద ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ (అఖ) ఎస్.వి. రాజశేఖర బాబును తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసారు. విజయవాడలో పోలీసులు ఫ్రెండ్లీ పోలీసింగ్ మరిచి, మాఫియాల కొమ్ముకాస్తూ "ప్రైవేట్ సెటిల్మెంట్ సిండికేట్" నడుపుతున్నారని లేఖలో పేర్కొన్నారు. సాయికృష్ణ అక్రమ నిర్బంధం, హత్యపై సెక్షన్ 176(1o) కింద తక్షణమే స్వతంత్ర జ్యుడీషియల్ విచారణ జరపాలని అయన కోరారు.

## నేడు మండల కేంద్రం తుగ్గలికు
# జిల్లా కలెక్టర్ సిరి రాక

**- తహసిల్దార్ రవి - పిజిఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరణ**



**తుగ్గలి** నేడు మండల కేంద్రమైన తుగ్గలికు కర్నూలు జిల్లా కలెక్టర్ సిరి,జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ వస్తున్నట్లు తుగ్గలి తహసిల్దార్ రవి తెలియజేశారు.గురువారం రోజున తహసిల్దార్ కార్యాలయం నందు ఆయన మాట్లాడుతూ శుక్రవారం రోజున ఉదయం 9 గంటలకు తుగ్గలిలోని సాధనా విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు జిల్లా కలెక్టర్ సిరి,జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్,పత్తికొండ శాసనసభ్యులు కే.ఈ శాంబాబులు హాజరై తుగ్గలి మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల ప్రజలకు సంబంధించిన ప్రజా సమస్యల దరఖాస్తులు స్వీకరిస్తారని వారు తెలియజేశారు.కావున శుక్రవారం రోజున జరిగే ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమానికి మండల పరిధిలోని గల అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆయన తెలియజేశారు.కావున ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికను మండల వ్యాప్తంగా గల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ రవి ప్రజలకు తెలియజేశారు.

## కూటమి సమావేశానికి బద్వేల్ నుండి భారీగా వెళ్లిన తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు




**బద్వేలు** కడపలో గురువారం జరుగుతున్న కూటమి పార్టీల సమావేశానికి బద్వేలు నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు బద్వేల్ లో డిసిసి బ్యాంకు చేర్మన్ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో వెళ్లారు

## బెల్ స్టార్ గోల్డ్ ఫైనాన్స్ షోరూంను
# సందర్శించిన ఎమ్మెల్యే శ్యాంబాబు



**తుగ్గలి:** తుగ్గలి మండల పరిధిలోని పెండేకల్ ఆర్.ఎస్ గ్రామం నందు బుధవారం రోజున నూతనంగా ప్రారంభమైన బెల్ స్టార్ గోల్డ్ ఫైనాన్స్ షోరూంను పత్తికొండ శాసనసభ్యులు కేఈ శ్యాంబాబు గురువారం రోజున సందర్శించి కంపెనీ ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు.బెల్ స్టార్ గోల్డ్ ఫైనాన్స్ షోరూంకు విచ్చేసిన ఎమ్మెల్యే శ్యాంబాబుకు సంస్థ ప్రతినిధులు ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఆయన సంస్థ ప్రతినిధులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు,మాజీ సర్పంచ్ మసాలా శీను,డాక్టర్ చంద్ర,ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు,చాంద్ బాషా, సంస్థ ప్రతినిధులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పట్టిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఉమ్రా యాత్రకు బయలుదేరిన
# ప్రయాణికులు

**హైదరాబాద్** ఇస్లామిక్ నూతన సంవత్సరం ను పురస్కరించుకొని అల్ మిజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో ఉమ్రా యాత్ర చేసుకోవడానికి శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి 53 మంది ప్రయాణికులు బయలుదేరి వెళ్లారు. శంషాబాద్ ఎయిర్పోర్టులో ప్రయాణికుల కుటుంబ సభ్యులు ఘన వీడ్కోలు పలికారు.. అల్ నిజాం టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజర్ మహమ్మద్ ఫవ్వద్ అలీ మాట్లాడుతూ ఇస్లామిక్ నూతన సంవత్సరంలో ప్రయాణికులు మొదటి ఉమ్రా యాత్ర చేసుకోవడం సంతోషకరం అన్నారు.. అల్ మిజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ ఫయాజ్ అలీ హజ్ యాత్ర లో ఉన్నారని, హజ్ యాత్ర పూర్తి కాగానే ఈ ప్రయాణికులను జిద్దా ఎయిర్పోర్టులో రిసీవ్ చేసుకుని ఈ ప్రయాణికులతో కలిసి ఉమ్రా కూడా నిర్వహించుకుంటారని తెలిపారు.

## నగునూరు గ్రామంలో ఎరువుల గోదామును పరిశీలించిన అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



**కరీంనగర్** జిల్లాలో ఏయే ఎరువులు ఏ డీలర్లకు పంపిణీ చేశారనే వివరాలను తెలుసుకున్నారు. జిల్లాలోని విత్తన కేంద్రాలు, ఎరువుల విక్రయ కేంద్రాలు మరియు ఇప్పటివరకు జరిగిన అమ్మకాల వివరాలను సమగ్రంగా పరిశీలించారు.అలాగే వరి, మొక్కజొన్న మరియు పత్తి విత్తన నిల్వలను గోదాములలో పరిశీలించారు. అనంతరం నగునూరు గ్రామంలోని అగ్రో రైతు సేవా కేంద్రంలో ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చిన వరి విత్తనాలైన బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-1508 మరియు కేఎన్ఎం-1638 వంటి వంగడాలను పరిశీలించారు.వాటి విత్తన నిల్వ వివరాలను, టీఎస్ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా సరఫరా చేసిన పెసర మరియు ఇతర విత్తనాల వివరాలను, అలాగే జీలుగజనుము విత్తనాల నాణ్యతను కూడా పరిశీలించారు.తదుపరి అక్కడ ఉన్న రైతులకు పాయింట్ ఆఫ్ సేల్ పిఓ ఎస్ యంత్రం ద్వారా జరిగే అమ్మకాల విధానాన్ని వివరించారు. రైతుల ఆధార్ నమోదు చేసి ఈ-పాస్ యంత్రం ద్వారా అవసరమైన కాంప్లెక్స్ ఎరువులను విక్రయించే ప్రక్రియను వారి సమక్షంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంచాలకులు కె. రణధీర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సత్యం మరియు ఇతర వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# సన్మానమా... అవమానమా?

**- ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యార్థినులకు తీరని అవమానం.**

**- ఒకే శాలువాతో ఇద్దరికి సన్మానం... - వివక్ష ఆరోపణలు.**



**తుగ్గలి:** ప్రతిభను ప్రోత్సహించాల్సిన విద్యా సంస్థలోనే ఇద్దరు గిరిజన విద్యార్థినులు అవమానానికి గురైన ఘటన తుగ్గలి మండలంలోని రాతన గిరిజన ఆశ్రమ పాఠశాలలో చోటుచేసుకుంది. పదో తరగతి ఫలితాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థినులను సన్మానించే కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుల వ్యవహారశైలి విమర్శలకు తావిచ్చింది.పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఇద్దరు విద్యార్థినులకు వేర్వేరుగా గౌరవం ఇవ్వాల్సిన చోట ఒకే శాలువాను ఇద్దరిపై ఒకేసారి కప్పి సన్మానించడం చర్చనీయాంశంగా మారింది. అంతటితో ఆగకుండా ఒక విద్యార్థినికి స్వీట్ బాక్స్ అందించగా, మరో విద్యార్థినికి కేవలం శాలువా మాత్రమే ఇవ్వడం పలువురి ఆగ్రహానికి కారణమైంది.ప్రతిభకు గుర్తింపుగా నిర్వహించిన కార్యక్రమంలోనే విద్యార్థినుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం పై తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విద్యార్థుల మధ్య ఎలాంటి తేడా లేకుండా సమాన గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యంపై ఉందని పేర్కొంటున్నారు.ఇద్దరు విద్యార్థినులు సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందినవారే కావడంతో ఈ ఘటనపై వివక్ష కోణంలోనూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి."విద్యార్థులు సాధించిన విజయాన్ని గౌరవించకుండా ఇలా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం?" అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.విద్యా సంస్థలు సమానత్వానికి ప్రతీకలుగా నిలవాల్సిన సమయంలో ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరమని సామాజిక సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.ఈ వ్యవహారంపై గిరిజన సంక్షేమ శాఖ అధికారులు వెంటనే విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని,బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు."విద్యార్థుల ప్రతిభను గౌరవించాల్సిన వేదికపై అవమానకర పరిస్థితులు నెలకొనడం అత్యంత విచారకరం.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి" అని ప్రజలు కోరుతున్నారు.

## కెనరా బ్యాంకులో మధ్య దళారులను
# తొలగించాలి

**- బ్యాంకులో రైతుల అప్పులు మధ్య దళారులతో కట్టిస్తే బ్యాంకు సిబ్బందికి ,మేనేజర్ కు వాటా ఎంత ?**

**- రైతు సంఘం డిమాండ్.!**




**కౌతాళం:** కౌతాళం మండల కేంద్రంలో కెనరా బ్యాంకులో రైతుల వ్యవసాయ రుణాలు రెన్యువల్ డబ్బులు చెల్లించడానికి వెళ్ళితే అక్కడ బ్యాంకులో మధ్య దళారులు వాళ్లతో( రైతు తో )కలిసి నీ అప్పు నేను కడతాను అని చెప్పి ,ఆయన అప్పు మధ్య దళారులు కట్టడం వల్ల ,వడ్డీ, మధ్య దళారుల కమిషన్, ఇతర ఖర్చులు అన్నీ కూడా రైతే భరించవలసి ఉంటుంది. కనుక బ్యాంకులో మధ్య దళారులను తొలగించాలని, బ్యాంకులోకి అనుమతించరాదని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే మల్లయ్య మేనేజర్ కు వినతి పత్రాన్ని అందించారు.. మండలంలో ఆరు బ్యాంకులు ఉన్నా ఏ బ్యాంకుల్లో కూడా కెనరా బ్యాంకులో ఉన్నటువంటి మధ్య దళారుల వ్యవస్థ లేదు. రైతులే నేరుగా బ్యాంకుకు పోయి మేనేజర్ తో మాట్లాడి స్తోమత ఉన్నవాళ్లు అసలు ,వడ్డీ కలిపి కడతారు. స్తోమత లేని వాళ్ళు వడ్డీ మాత్రమే కట్టి రెన్యువల్ చేయించుకుంటారు అలాంటి పద్ధతి కెనరా బ్యాంకులో లేదు. ఇక్కడ మధ్య దళారులకు ,బ్యాంకు సిబ్బందికి ,మేనేజర్ లోపాయికారిగా ఒప్పందాలు చేసుకొని లావాదేవీలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. రైతు అప్పు మధ్య దళారులు కడితే సంవత్సరానికి, సంవత్సరానికి అప్పు పెరుగుతుంది తప్ప , రైతుకు అప్పు సమస్య తీరదు అని ఆయన అన్నారు .కనుక ఇప్పటి నుంచైనా బ్యాంకు బ్యాంకు సిబ్బంది, మేనేజర్ మేల్కొని బ్యాంకులో మద్దతు దారుల వ్యవస్థను రద్దు చేయాలని లేకపోతే రైతులను సమీకరించి బ్యాంకు ముందు ఆందోళన కార్యక్రమాలను చేపట్టగలమని హెచ్చరించరు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి బి ఈరన్న ,రైతు సంఘం నాయకులు సత్యప్ప ,ఈరన్న, వెంకటేష్ ,నారాయణ, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు, మానవ హక్కులపై ప్రజల్లో అవగాహన పెంచాలి

**- జాతీయ చైర్మన్ డాక్టర్ కొమ్మోజు రమేష్ పిలుపు**

**- పారదర్శకతకు ఆర్‌టీఐ అత్యంత శక్తివంతమైన సాధనం**

**- బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తా: టి. రమేష్ గుప్తా**

**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** ఫోరం ఫర్ ఆర్‌టీఐ అండ్ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ చైర్మన్ డాక్టర్ కొమ్మోజు రమేష్ మేడ్చల్ జిల్లా పర్యటనలో భాగంగా నిర్వహించిన రెండు రోజుల రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఘనంగా ముగిసింది. మేడ్చల్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సంస్థ భవిష్యత్తు కార్యాచరణ, సభ్యత్వ విస్తరణ, సమాచార హక్కు చట్టం మరియు మానవ హక్కుల పరిరక్షణకు సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించి ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జాతీయ చైర్మన్ డాక్టర్ కొమ్మోజు రమేష్ మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయి నుంచి పట్టణాల వరకు ప్రజల్లో సమాచార హక్కు చట్టం, మానవ హక్కులపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడానికి ఆర్‌టీఐ చట్టం ఒక శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. ఆర్‌టీఐ కార్యకర్తలు దరఖాస్తులు చేసేటప్పుడు చట్టబద్ధమైన, స్పష్టమైన సమాచారాన్ని మాత్రమే కోరాలని ఆయన సూచించారు. రికార్డుల పరిశీలనకు వెళ్లే సమయంలో ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అవసరమైన పత్రాలు, గుర్తింపు కార్డులు వెంట ఉంచుకోవాలని స్పష్టం చేశారు. సమాచార సేకరణలో నిజాయితీ, నిబద్ధత ముఖ్యమని గుర్తుచేశారు.

### టి.రమేష్ గుప్తాకు జాతీయ స్థాయి పదోన్నతి :

తెలంగాణ రాష్ట్రంలో ఆర్‌టీఐ, హ్యూమన్ రైట్స్ రంగాల్లో విశేష సేవలు అందిస్తూ, సంస్థ



బలోపేతానికి కృషి చేస్తున్న రాష్ట్ర అధ్యక్షులు టి. రమేష్ గుప్తా సేవలను డాక్టర్ కొమ్మోజు రమేష్ అభినందించారు. ఆయన సేవలకు గుర్తింపుగా రమేష్ గుప్తాను 'జాతీయ కార్యవర్గ సభ్యుడిగా' నియమిస్తూ నియామక ఉత్తర్వులను అందజేశారు. ప్రజాసేవే పరమావధిగా ప్రతి సభ్యుడు సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కే. స్వాతి, రాష్ట్ర సలహాదారు కే. సురేష్, మేడ్చల్ మహిళా అధ్యక్షురాలు ఎం. విజయలక్ష్మి, సిద్దిపేట మహిళా జిల్లా అధ్యక్షురాలు ఎం.లావణ్య, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి.నర్సింహులు, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు బి. గోపి, రాష్ట్ర సభ్యులు మల్లికార్జున్, సంస్థ కోర్ కమిటీ సభ్యురాలు కే. రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## యూరియా అమ్మకాల్లో అక్రమ వసూళ్లు..

# రైతుల ఆందోళన



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలంలోని ఓ ఎరువుల దుకాణంలో యూరియా విక్రయాల సందర్భంగా రైతు నుంచి బిల్లుకు మించి డబ్బులు వసూలు చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఎరువుల కోసం రైతులు దుకాణాలపై ఆధారపడుతుండగా, కొందరు వ్యాపారులు ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.మండలానికి చెందిన ఓ రైతు తన ఒక ఎకరం భూమికి అవసరమైన యూరియాను ఫర్టిలైజర్ యాప్ ద్వారా బుక్ చేసుకున్నాడు. అతనికి మొత్తం మూడు బస్తాలు కేటాయించగా, ప్రస్తుతం రెండు బస్తాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, మరో బస్తా 15 రోజుల తర్వాత ఇస్తామని సంబంధిత కేంద్రం తెలిపింది.రైతు తనకు కేటాయించిన కేంద్రానికి వెళ్లి రెండు యూరియా బస్తాలు తీసుకున్నాడు. ఒక్కో బస్తాకు రూ.266 చొప్పున మొత్తం రూ.532 మాత్రమే బిల్లులో నమోదు చేశారు. అయితే దుకాణ యజమాని రూ.600 చెల్లించాలని కోరడంతో రైతు కారణం అడిగినా స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా "కావాలంటే తీసుకో, లేదంటే వద్దు" అన్నట్లు రైతు ఆరోపించాడు. యూరియా అత్యవసరంగా అవసరం కావడంతో రైతు ఫోన్‌పే ద్వారా రూ.600 చెల్లించాడు.అంతేకాకుండా, గోదాంలో రెండు బస్తాలకు హమాలీ చార్జీల పేరుతో మరో రూ.20 వసూలు చేసినట్లు రైతు తెలిపాడు. దీంతో రెండు బస్తాలపై మొత్తం రూ.620 చెల్లించాల్సి వచ్చిందని, బిల్లులో ఉన్న ధరకు మించి డబ్బులు వసూలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై వ్యవసాయ శాఖ అధికారులు, తనిఖీ అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు అందేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఈ విషయంపై వ్యవసాయ అధికారి వసంత రావు మాట్లాడుతూ, రైతులకు ఎరువులు, విత్తనాలు మరియు ఇతర వ్యవసాయ ఉత్పత్తులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధికంగా వసూలు చేయడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## తెలంగాణ వచ్చినంక పేదలు బాగుపడ్డారా: టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**- ఆడవారికి మా పార్టీ ద్వారా అండ దొరికిందని సంబరపడుతున్నారు**

**- నేరెళ్ల బాధితుల ఓట్లతో బండి సంజయ్ కేంద్రమంత్రి అయ్యారు**




**సిరిసిల్ల (ప్రశ్న న్యూస్)** సిరిసిల్లలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ రైతన్నల నడ్డి విరిస్తే కేటీఆర్ ఎందుకు మాట్లాడట్లేదని ప్రశ్నించారు. మాజీమంత్రి కేటీఆర్‌పై కవిత షాకింగ్ కామెంట్స్ చేశారు. కేటీఆర్ సిరిసిల్లాకు వీకెండ్‌లో వచ్చి వెళ్లిపోతారని ఎద్దేవా చేశారు. సిరిసిల్లలో సెస్ ఆగమాగం అయితే కేటీఆర్ఎ ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. తెలంగాణ వచ్చినంక పేదలు బాగుపడ్డారా అని ప్రశ్నించారు.

### దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని మండిపడ్డ కవిత

రైతు డిస్కంలపై ఇప్పటి వరకు కేటీఆర్ ఎందుకు నోరెత్తలేదని కవిత ప్రశ్నల వర్షం కురిపించారు. రైతు డిస్కం కావాలో, వద్దో ఆయన ఎందుకు చెప్పలేదని నిలదీశారు. నేరెళ్లలో అక్రమ ఇసుక సంపాదన కోసం దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ధ్వజమెత్తారు. నేరెళ్ల బాధితులకు ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదని చెప్పుకొచ్చారు. నేరెళ్ల ఇసుక బాధితుల తరపున కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కార్పొరేటర్‌గా వచ్చి.. నేరెళ్ల బాధితుల ఓట్లతో బండి సంజయ్ కేంద్రమంత్రి అయ్యారని కవిత అన్నారు. జెండా పండగ కార్యక్రమంలో పాల్గొని జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో మా ఇంటి బంగారం టీమ్

**తిరుమల,** స్టార్ హీరోయిన్ సమంత నటించిన 'మా ఇంటి బంగారం' సినిమా విడుదలకు సిద్ధమైన వేళ, చిత్ర బృందం తిరుమల శ్రీవారి ఆశీస్సులు తీసుకుంది. గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో చిత్ర యూనిట్ సభ్యులు శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.నటి సమంత, ఆమె భర్త, చిత్ర నిర్మాత అయిన రాజ్ నిడిమోరు, దర్శకురాలు నందిని రెడ్డి, నటి-యాంకర్ శ్రీముఖి తదితరులు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న చిత్ర బృందానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వారికి వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.నందిని రెడ్డి దర్శకత్వంలో ఫ్యామిలీ యాక్షన్ కామెడీ డ్రామాగా తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' చిత్రం జూన్ 19న (శుక్రవారం) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. సినిమా విడుదలకు ఒక్కరోజు ముందు చిత్ర విజయం కోసం స్వామివారిని ప్రార్థించినట్లు చిత్ర బృందం తెలిపింది. ఇప్పటికే ఈ సినిమా ట్రైలర్, ప్రమోషన్లకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి.

## రూ.750కే 15 లక్షల ప్రమాద బీమా

**రాజమండ్రి,** పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక భరోసా కోసం కేంద్ర ప్రభుత్వం పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న పలు సంక్షేమ పథకాలపై బీజేపీ ఏపీ శ్రేణులు స్పెషల్ డ్రైవ్ చేపట్టాయి. ఇందులో భాగంగా ఈరోజు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో పర్యటించిన బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్... పోస్టల్ శాఖ ద్వారా కేంద్రం ప్రవేశపెట్టిన పథకాల ప్రత్యేక నమోదు స్టాల్‌ను అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ... పేద, మధ్యతరగతి వర్గాల సంక్షేమం కోసం ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా ప్రధానమంత్రి మోదీ అనేక వినూత్న పథకాలను ప్రవేశపెట్టారని కొనియాడారు. చౌకగా, అతి తక్కువ ప్రీమియంతో సామాన్యులకు కూడా అందుబాటులో ఉండేలా లైఫ్ ఇన్సూరెన్స్ (జీవిత బీమా) పథకాలను కేంద్రం అమలు చేస్తోందన్నారు. కేవలం రూ. 750 చెల్లిస్తే చాలు.. ఏకంగా రూ. 15 లక్షల ప్రమాద బీమా సదుపాయం లభిస్తుందని వివరించారు. అలాగే పోస్టల్ ఆఫీసుల ద్వారా మరెక్కడా లేనంత అత్యధిక వడ్డీ ఇచ్చే పలు పొదుపు పథకాలను మోదీ ప్రభుత్వం సమర్థంగా చేపడుతోందని చెప్పారు.కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ లబ్ధిని ప్రజల ముంగిటకే తీసుకెళ్లేందుకు తాము ప్లాన్ చేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు తెలిపారు. ఈ స్కీమ్స్‌లో ప్రజలు సులభంగా చేరేందుకు వీలుగా అన్ని నగరాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించడమే మోదీ ప్రభుత్వ ధ్యేయమని, ఈ దేశాభివృద్ధి యజ్ఞంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మాధవ్ పిలుపునిచ్చారు.

## ఇంటర్ రిజల్ట్స్ రిలీజ్

**విజయవాడ** ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఎగ్జామినేషన్స్ (ఐపీఏఎస్ఈ)-2026 ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌తో పాటు వాట్సాప్ మనమిత్ర సేవ ద్వారా కూడా తెలుసుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు ఇంప్రూవ్ మెంట్ పరీక్షల ద్వారా తమ ఫలితాలను మెరుగుపరుచుకున్న వారిని అభినందించారు. వారి పట్టుదల, కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు.మొదటి సంవత్సరం ఫలితాల్లో 2,29,034 మంది విద్యార్థుల్లో 1,35,435 మంది (59 శాతం) తమ స్కోర్‌ను మెరుగుపరుచుకున్నారు. అలాగే 1,09,003 మంది అభ్యర్థుల్లో 42,379 మంది (39 శాతం) ఉత్తీర్ణత సాధించి ఫలితాలను మెరుగుపరుచుకున్నారు. రెండో సంవత్సరం ఫలితాల్లో 91,303 మంది విద్యార్థుల్లో 48,149 మంది (53 శాతం) మెరుగైన ఫలితాలు సాధించారు. మరోవైపు 1,02,018 మంది అభ్యర్థుల్లో 57,327 మంది (56 శాతం) ఉత్తీర్ణత సాధించి తమ ఫలితాలను మెరుగుపరుచుకున్నారు.ప్రభుత్వం కల్పించిన అవకాశంతో మొత్తం 1.83 లక్షల మందికి పైగా విద్యార్థులు తమ మార్కులను పెంచుకోగలిగారు. అలాగే సాధారణ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయిన దాదాపు లక్ష మంది విద్యార్థులకు మరో అవకాశం లభించడంతో వారు ఉన్నత విద్య వైపు అడుగులు వేయడానికి మార్గం సుగమమైంది. విద్యార్థులంతా ఆత్మవిశ్వాసంతో ఉన్నత విద్యను కొనసాగించి మరిన్ని విజయాలు సాధించాలని లోకేశ్ ఆకాంక్షించారు.

## రైతు భీమా ఎగ్గొటేందుకు కుట్ర

**హైదరాబాద్** తెలంగాణలో రైతు సమస్యలను అధికార కాంగ్రెస్ పార్టీ పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో రైతు బీమా పథకాన్ని ఎగ్గొట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కనుమరుగు చేయాలని చూస్తే... ప్రజలు ఈ కాంగ్రెస్ నాయకులనే కనుమరుగు చేస్తారని అన్నారు.రాష్ట్రంలో వివిధ కారణాలతో దాదాపు 7,600 మంది రైతులు మరణిస్తే... వారికి అందాల్సిన రైతు బీమా డబ్బులు ఇప్పటివరకు రాలేదని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎల్ఐసీకి ఇన్స్యూరెన్స్ ప్రీమియం సకాలంలో చెల్లించకపోవడం వల్లే ఈ క్లెయిమ్స్ ఆగిపోయాయనే వార్తలు వస్తున్నాయన్నారు. ఇది కేసీఆర్ తీసుకొచ్చిన పథకం కాబట్టే... దీనిని ఎలాగైనా మూలనపడేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. చేతనైతే కొత్త పథకాలు తేవాలి తప్ప, ఉన్న పథకాలను చెడగొట్టవద్దని హితవు పలికారు.మొత్తం 33 రకాల వడ్లు ఉంటే.. ప్రభుత్వం కేవలం 7 రకాల వడ్లను మాత్రమే బోనస్‌కు గుర్తిస్తోందన్నారు. అయితే ఈ 7 రకాల వడ్లు సాగు చేస్తే ఎకరానికి కేవలం 20 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుందని, అదే మిగతా 26 రకాల వడ్లు వేస్తే ఎకరానికి ఏకంగా 30 క్వింటాళ్ల పంట పండుతుందని చెప్పారు. ప్రభుత్వం చెప్పిన ఆ 7 రకాల వడ్లు పండించడం వల్ల రైతులు ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి నష్టపోతారని... అంటే ఒక్కో రైతు ఎకరానికి దాదాపు రూ. 24 వేల ఆదాయం కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు.

### అవినీతిపై సమాధానం చెప్పలేరా

తెలంగాణ రాజకీయాల్లో, ముఖ్యంగా జగిత్యాల-ధర్మపురి పొలిటికల్ సర్కిల్స్‌లో హీట్ ఒక్కసారిగా పెరిగింది. కాంగ్రెస్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను టార్గెట్ చేస్తూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తమపై వస్తున్న అవినీతి ఆరోపణలకు సమాధానం చెప్పలేక, లక్ష్మణ్ వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారంటూ మండిపడ్డారు.ధర్మపురి నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లు, ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల టెండర్లలో భారీ ఎత్తున అవినీతి జరిగిందని కొప్పుల ఈశ్వర్ నేరుగా ఆరోపించారు. వీటితో పాటు నియోజకవర్గ పరిధిలోని ఇసుక రీచ్‌లు మాయమైపోతున్నాయన్నది పచ్చి నిజం కాదా అంటూ ఆయన నిలదీశారు. ప్రజా సమస్యలను, ఈ అవినీతి లెక్కలను పక్కదారి పట్టించడానికి మంత్రి లక్ష్మణ్ కుల రాజకీయం చేస్తున్నారని కొప్పుల మండిపడ్డారు. బీఆర్ఎస్ కీలక నేత హరీశ్‌రావును ఉద్దేశించి 'దొర' అంటూ కులాన్ని ప్రస్తావిస్తూ మాట్లాడటం ఏ రకమైన రాజకీయ సంస్కృతి? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు నిజంగానే అవినీతిపై మాట్లాడే ధైర్యం, చిత్తశుద్ధి ఉంటే తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేసి ప్రజల ముందుకు రావాలని కొప్పుల ఈశ్వర్ ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. అయితే మంత్రి పదవిని వదులుకోవడం అంత సులభం కాదని.. ఎన్నో కష్టాలు పడి, ఎన్నో ప్రయత్నాల తర్వాత ఈసారి ఎమ్మెల్యేగా గెలిచిన లక్ష్మణ్‌కు రాజీనామా చేసేంత ధైర్యం అస్సలు లేదంటూ ఎద్దేవా చేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ నుండి స్వర్ణముఖి నది ప్రమాద బాధిత కుటుంబాలకు పరిహారం చెక్కుల పంపిణీ

**తిరుపతి** స్వర్ణముఖి నది ప్రమాద బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) నుండి మంజూరైన పూర్తి పరిహారం చెక్కులను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో కలిసి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ గురువారం కలెక్టరేట్‌లో పంపిణీ చేశారు.?2025 అక్టోబర్ 24న ముంతా తుపాన్ ప్రభావంతో తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం సమీపంలోని స్వర్ణముఖి నదిలో గల్లంతై నలుగురు బాలురు (ఎన్. తేజ, ఎస్. బాలు, ఎం. ప్రకాష్, టి. మునిచంద్ర) మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ విషాద ఘటనపై స్పందించిన ముఖ్యమంత్రి, బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ప్రకటించారు.?ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించింది. గతంలో ముగ్గురు బాధితుల కుటుంబాలకు రూ. 1.50 లక్షల చొప్పున అందించగా, మిగిలిన రూ. 50 వేల చొప్పున (మొత్తం రూ. 1.50 లక్షలు) మరియు ఎస్. బాలు కుటుంబానికి పూర్తి మొత్తమైన రూ. 2 లక్షల చెక్కును కలిపి, నేడు మొత్తం రూ. 3.50 లక్షల విలువైన పరిహార చెక్కులను బాధితులకు అందజేశారు. దీంతో ప్రభుత్వం ప్రకటించిన పూర్తి పరిహారం అందినట్లయింది.?ఈ సందర్భంగా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ, పిల్లలను కోల్పోయిన కుటుంబాల బాధ పూడ్చలేనిదని, కష్టకాలంలో ప్రభుత్వం వారికి తోడుగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందించడంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందించడం ప్రభుత్వ మానవతా దృక్పథానికి నిదర్శనమన్నారు. అనంతరం అధికారులు, ఎమ్మెల్యే బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ తహశిల్దార్ జనార్ధన్ మరియు బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## తీర ప్రాంతాల్లో హరిత వలయాలు

**విజయవాడ,** ఏపీ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం సరికొత్త వ్యూహాలతో స్పీడ్ పెంచింది. రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సహజ వనరులను వాడుకుంటూ అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ నిరంతరం కసరత్తులు చేస్తున్నారు. ఇందులో భాగంగా... ఏపీకి ఉన్న సుదీర్ఘ తీర ప్రాంతాన్ని అటు టూరిజం పరంగా, ఇటు పర్యావరణ పరంగా అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఒక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళుతోందిఏపీ కోస్తా తీరాన్ని శరవేగంగా అభివృద్ధి చేయడమే కాకుండా, పర్యావరణ రక్షణ కోసం 'కోస్తా గ్రీన్ బెల్ట్'ను విస్తరించేందుకు డిప్యూటీ పవన్ కల్యాణ్ నడుం బిగించారు. ఇందులో భాగంగా ఈరోజు సచివాలయంలో అటవీ, పర్యావరణ శాఖ ఉన్నతాధికారులతో ఆయన ఒక కీలక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.తీర ప్రాంతాల్లో భారీగా మొక్కలు నాటి, హరిత వలయాలను (గ్రీన్ జోన్స్) ఏర్పాటు చేయడం ద్వారా సముద్రపు కోతను అడ్డుకోవచ్చని, తుపానుల తీవ్రతను తగ్గించవచ్చని పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. దీనికోసం తక్షణమే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ గ్రీన్ బెల్ట్ ప్రాజెక్ట్‌లో కేవలం ప్రభుత్వానిదే కాకుండా స్థానిక ప్రజలను కూడా భాగస్వామ్యం చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. తీర ప్రాంత గ్రామాల్లో సామాజిక అడవుల . పెంపకానికి ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహించాలని, తద్వారా పర్యావరణానికి మేలు జరగడమే కాకుండా స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని అధికారులకు స్పష్టం చేశారు.

## టీటీడీ ఎంప్లాయిస్ క్రెడిట్ సొసైటీ జనరల్ బాడీ సమావేశాన్ని వాయిదా వేయాలి...

**- టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చీర్ల కిరణ్ డిమాండ్**



**తిరుపతి** జూన్ 30వ తేదీన నిర్వహించ తలపెట్టిన టీటీడీ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ జనరల్ బాడీ సమావేశాన్ని మరో అనుకూలమైన తేదీకి వాయిదా వేయాలని ఆ సొసైటీ డైరెక్టర్, టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చీర్ల కిరణ్ డిమాండ్ చేశారు. ఉద్యోగుల ప్రయోజనాలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ సమావేశాన్ని ఒక బాధ్యతగల డైరెక్టర్‌గా తాను బహిష్కరిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 30వ తేదీన దాదాపు 130 మంది టీటీడీ ఉద్యోగులు పదవీ విరమణ పొందుతున్నారని తెలిపారు. శ్రీవారి సేవలో దశాబ్దాల పాటు విశిష్ట సేవలు అందించిన ఆ ఉద్యోగులను ఘనంగా సన్మానించి, వారికి గౌరవప్రదంగా వీడ్కోలు పలకాల్సిన ముఖ్యమైన రోజున ఈ సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేయడం సరికాదన్నారు. దీనివల్ల పదవీ విరమణ పొందుతున్న సభ్యులు, ఇతర ఉద్యోగులు సమావేశానికి పూర్తిస్థాయిలో హాజరుకాలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఉద్యోగుల మనోభావాలను, వారి సేవలను దృష్టిలో ఉంచుకుని సమావేశాన్ని వాయిదా వేయాలని పాలకవర్గాన్ని ఇప్పటికే కోరినప్పటికీ, ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం విచారకరమన్నారు. ఈ సమావేశానికి అనుమతి మంజూరు చేసిన టీటీడీ యాజమాన్యం కూడా పునరాలోచన చేయాలని, ఇచ్చిన అనుమతిని ఉపసంహరించుకుని సమావేశం వాయిదా పడేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగుల సన్మాన కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం మన అందరి బాధ్యతని, ఉద్యోగుల ఐక్యత, సంక్షేమం, గౌరవమే తమ ప్రధాన లక్ష్యమని చీర్ల కిరణ్ స్పష్టం చేశా

## రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది.

**- స్టేషన్కు వెళ్లిన యువకులను చంపి తగలబెట్టి బూడిద చేయడం దుర్మార్గం :**

**- మాజీ మంత్రి అంబటి రాంబాబు**

**గుంటూరు** గాదె సాయికృష్ణ అనే యువకుడును కృష్ణలంక పోలీసులు చంపి, బూడిద చేశారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. గుంటూరులో ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గాదె సాయికృష్ణ మేనమామ, వంగవీటి నరేంద్రతో కలిసి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడారు. గాదె సాయికృష్ణ తప్పు చేస్తే చట్ట ప్రకారం శిక్షించాలి కానీ, లాకప్ డెత్ చేసి, బూడిద చేసే హక్కు పోలీసులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. హృదయ విదారకమైన సంఘటనలాకప్ డెత్ లు చూసాము, డెడ్ బాడీని సంబంధిత వ్యక్తులకు అప్పగించడం చూసాము. హైకోర్టులో హెబియఎస్ కార్పస్ పిటిషన్ వేస్తే పోలీసులు వెతుకుతున్నామని సమాధానం చెప్పారు. సాయి కృష్ణ ఎక్కడున్నాడు చంపింది పోలీసులే ట్రీట్మెంట్ ఇప్పించింది పోలీస్ లే, దహనం చేసింది పోలీసులే. ఇవన్నీ ప్రజలు చూశారు. పవన్ కళ్యాణ్ దీనిపై తక్షణమే స్పందించి, ఎంక్వయిరీ వేసి, బాధితులకు న్యాయం చేయాలని ప్రాధేయపడ్డారు. దీనిలో పాత్ర ఉన్న ప్రతి ఒక్కరికి ఉరిశిక్ష వేయాలి అని డిమాండ్ చేశారు. సిట్ లేదా సిబిఐ వేయడం వలన ఎలాంటి ప్రయోజనాలు లేదని అన్నారు. చంపి బూడిద చేసి అది కూడా ఇవ్వకుండా లక్షలు, కోట్లు ఇస్తామని బేరం చేయటం ఏమిటని నిలదీశారు

## బీచ్ షాక్స్ వద్దు సముద్ర తీరాల్లో యువతరాన్ని నాశనం చేయవద్దు

**- ప్రముఖ సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు**

**కాకినాడ:** మద్యం షాపులు, బార్లు, అనధికార బెల్ట్ షాపులు, గంజాయి, గుట్కా, సారా వంటి మహమ్మరిలన్నీ కాకినాడ యువతను భ్రష్టు పట్టిస్తుంటే ఇప్పుడు పర్యాటకం పేరిట ప్రభుత్వం తీసుకువస్తున్న బీచ్ షాక్స్ ను వెంటనే ఉపశమహరించుకోవాలని లేదా ప్రజావ్యతిరేకతను మూటకట్టు కోవాల్సి వస్తుందని ప్రముఖ సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు హెచ్చరించారు. బీచ్ షాక్స్ వలన యువత భవిష్యత్ ప్రగతికి కరెంట్ షాక్ తరహాగా ఉందని ప్రముఖసామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు నిరసన వ్యక్తం చేశారు. ఎన్ టి ఆర్ బీచ్ లో గురువారం ఉదయం బీచ్ షాక్స్ వద్దు సముద్ర తీరాల్లో యువతరాన్ని నాశనం చేయవద్దని పేర్కొంటూ ప్లకార్డ్ తో ప్రదర్శన చేశారు.

# సిరిసిల్ల బైపాస్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం




సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సిరిసిల్ల బైపాస్ రోడ్డుపై కారు, డీసీఎం వ్యాన్ ఢీకొన్న ఘటనలో పలువురు గాయపడగా, ఆసుపత్రికి తరలించే క్రమంలో చికిత్స పొందుతూ ఒకరి మృతి.సిరిసిల్ల బైపాస్ రోడ్డుపై ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ విమానాశ్రయం నుంచి తిరిగి వస్తున్న కారు డీసీఎం వ్యాన్‌ను ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది.ప్రమాద సమయంలో కారులో జగిత్యాల, రాయికల్, మంచిర్యాల ప్రాంతాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. ఈ ఘటనలో కారులో ఉన్న వారితో పాటు డీసీఎం వ్యాన్‌లోని వ్యక్తులు కూడా గాయపడ్డారు.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను సిరిసిల్ల జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. హైదరాబాద్‌లో క్యాబ్ బుకింగ్ యాప్ ద్వారా వాహనాన్ని అద్దెకు తీసుకుని స్వగ్రామాలకు వెళుండగా ఈ ప్రమాదం జరిగింది.ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# 303 కోట్లతో నవ కంటోన్మెంట్ : ఎమ్మెల్యే



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న రెండు జాతీయ రహదారుల పై ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం ద్వారా కంటోన్మెంట్ బోర్డుకు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సమకూరిన 303 కోట్ల రూపాయలను సద్వినియోగం చేసుకుంటూ చేపట్టనున్న నాలాలు, డ్రైనేజీల పునరుద్ధరణ పనులను ప్రజల సూచనలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా చేపట్టేందుకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ గురువారం హెచ్ఎమ్ డబ్ల్యుఎస్ అధికారులు,కంటోన్మెంట్ బోర్డు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు.ఆరో వార్డు పరిధిలోని సీతారామపురం,మర్రి రాంరెడ్డి కాలనీ,హర్షవర్ధన కాలనీ, స్నేహ కాలనీ,భారత్ ఎవెన్యూ,అలాగే వార్డు 3 అన్న నగర్,వార్డు 2 రసూల్‌పుర,కట్టకింది బస్తీలలో పర్యటించి స్థానిక ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. ప్రజలు తెలిపిన సమస్యలకు అనుగుణంగా పనులు చేపట్టి,భవిష్యత్తు తరాల కోసం నవ కంటోన్మెంట్ నిర్మాణం దిశగా అడుగులు వేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ అధికారులకు సూచించారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంతో సమకూరిన ఈ నిధులు కేంద్రానికి వెళ్ళకుండా,కేవలం మన కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధికే ఉపయోగపడేలా చొరవ చూపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ కృతజ్ఞతలు తెలిపారు.సిఎం సహకారంతోనే కంటోన్మెంట్ చరిత్రలో మొదటిసారిగా ఇంత భారీ మొత్తంలో నిధులు సమకూరాయని ఆయన పేర్కొన్నారు.ఈ పర్యటనలో ఎమ్మెల్యే వెంట బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లిఖార్జున్, హెచ్ఎండబ్ల్యుఎస్ అధికారులు శ్రీనివాసులు, రవి,కంటోన్మెంట్ ఇంజనీరింగ్ అధికారులు ఉమాశంకర్, దినేష్,బోర్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ జంపన ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# పురపాలక కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి : మందాపురం నరేష్

**- ఎల్లంపేట్‌లో అధికారులకు వినతిపత్రం అందజేత**

**- వారం రోజుల్లో సమస్యలు తీరుస్తామని అధికారుల హామీ**




**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** ఎల్లంపేట్ పురపాలక కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పురపాలక అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ మండల కార్యదర్శి మందాపురం నరేష్ మాట్లాడుతూ పురపాలక కార్మికులకు మే నెలకు సంబంధించిన జీతాలు ఇప్పటివరకు చెల్లించకపోవడం అత్యంత విచారకరమన్నారు. ముఖ్యంగా జూన్ నెల అనేది విద్యాసంవత్సరం ప్రారంభ సమయం కావడంతో పిల్లల స్కూల్ ఫీజులు, పుస్తకాలు, దుస్తుల కొనుగోళ్లకు కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి కీలక సమయంలో జీతాలు ఆలస్యం చేయడం వల్ల కార్మికుల కుటుంబాలు ఇబ్బందుల పాలవుతున్నాయని మండిపడ్డారు.

### కార్మికుల ప్రధాన డిమాండ్లు ఇవే..

పురపాలక కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని నరేష్ డిమాండ్ చేశారు. ఢిల్లీ, హర్యానా రాష్ట్రాల తరహాలోనే ఇక్కడి కార్మికులను కూడా తక్షణమే పర్మనెంట్ చేయాలని, అలాగే కష్టపడి పనిచేసే పురపాలక కార్మికులకు మొదటి ప్రాధాన్యత కింద ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని కోరారు. సంవత్సరాలు గడుస్తున్నా కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడం దుర్మార్గమని, వారికి అందాల్సిన దుస్తులు, సబ్బులు, షాంపూలు, చెప్పులు, బ్లౌజులు, జాడుకట్టలు, షూస్, టార్చ్ లైట్లు, హెల్మెట్లు వంటి రక్షణ, మౌలిక సదుపాయాలను వెంటనే అందించాలన్నారు. వీటితో పాటు ప్రతి కార్మికుడికి రూ.60 లక్షల ఇన్సూరెన్స్ స్కీమ్ అమలు చేయాలని, 60 సంవత్సరాలు నిండిన కార్మికులను తొలగిస్తే వారికి రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకవేళ వారసులు ఉంటే, వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని స్పష్టం చేశారు.

### సానుకూలంగా స్పందించిన పురపాలక అధికారులు..

కార్మికుల నిరసన, వినతిపత్రంపై పురపాలక అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ రోజు లోపే కార్మికులందరికీ వేతనాలు జమ చేస్తామని స్పష్టం చేశారు. అలాగే పురపాలక పరిధిలో ఉన్న స్థానిక సమస్యలను వారం రోజుల్లోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన విధానపరమైన సమస్యలను ఉన్నతాధికారుల ప్రథమ దృష్టికి తీసుకెళ్లి, అవి పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని అధికారుల హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ మండల ఉపాధ్యక్షులు డి.నరసింగరావ్, మున్సిపల్ కార్మికులు సత్యనారాయణ, నర్సమ్మ, లక్ష్మి, రేణుక, రత్నం తదితరులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురు మృతి



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మురహరిపల్లి లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.హైదరాబాదు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న లారీని కరీంనగర్‌నుండి హైదరాబాద్ వైపు వస్తున్న కారు డివైడర్ ఎక్కి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది.. కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు.

### వివరాలు ఇలా ఉన్నాయి

మృతుడు చంద్రశేఖర్ కుటుంబం కరీంనగర్ జిల్లాలోని కొండగట్టు దర్శనం చేసుకొని వస్తుండగా అర్ధరాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అప్పటివరకు సరదాగా గడిపిన ఈ కుటుంబం హైదరాబాద్ కు వస్తుండగా ఈ ఘోర ప్రమాదం జరిగింది. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మురారి పల్లి వద్ద కారు డివైడర్ ఎక్కి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం మొత్తం నుజ్జునుజు కాగా కారు నడుపుతున్న చంద్రశేఖర్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన భార్య రేఖ, చిన్న కుమారుడు నిహాల్ కు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వీరిద్దరు మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పెద్ద కొడుకు లోహిత్ గాయాలతో బతికి బయటపడ్డాడు. గోదావరిఖని నుండి హైదరాబాద్ కు వస్తున్నది ఈ కుటుంబం. మధ్యలో కొండగట్టుకు వెళ్లి స్వామివారిని దర్శనం చేసుకొని హైదరాబాద్ కు బయలుదేరారు . బుధవారం అర్ధరాత్రి దాటాక ఈ ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు.

# చెట్లే మానవాళికి జీవనాధారం

**- టీపీసీసీ అధికార ప్రతినిధి హరివర్ధన్ రెడ్డి**



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** చెట్లే మానవాళికి జీవనాధారం అని టిపిసిసి అధికార ప్రతినిధి హరి వర్ధన్ రెడ్డి అన్నారు. గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని గౌడవెల్లి లో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి అధికార ప్రతినిధి హరి వర్ధన్ రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలే మానవాళికి జీవనాధారం కాబట్టి ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించాలని సూచించారు.రాష్ట్ర సర్పంచుల ఫారం మాజీ అధికార ప్రతినిది గరిసేలా సురేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ చెట్లు నాటడం ప్రతి ఒక్కరు బాధ్యత అని పేర్కొన్నారు. నాటిన మొక్కలను కాపాడాలని పేర్కొన్నారు. ఓబీసీ సెల్ అధ్యక్షులు గువ్వ రవి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## పేదవారి సొంతింటి కల

# కాంగ్రెస్ తోనే సాధ్యం

**- అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కంఠం శిరీష, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంకి రమేష్**



**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ నియోజకవర్గం అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మజీద్ పూర్ గ్రామంలో అబ్బాగౌని సంగీత -రవి గౌడ్ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంకి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని గృహప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారూ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా అనేక కుటుంబాలు సొంత ఇళ్ల కలను నెరవేర్చుకుంటున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని అన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు సరసం వనజ అశోక్ రెడ్డి , వార్డు సామల జశ్వంత్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ తుంకి బిక్షపతి, మాజీ సర్పంచ్ అబ్బాగౌని రాములు గౌడ్,ఏళ్ళ మల్లేష్ , మున్సిపల్ బీసీ సెల్ అధ్యక్షులు గిర్మాపూర్ నర్సింగ రావు గౌడ్, 10వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అబ్బాగౌని సురేష్ గౌడ్,సీనియర్ నాయకులు అబ్బగౌని భాస్కర్ గౌడ్, శ్రీశైలం గౌడ్, శ్యామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పీఎం అజయ్ పథకం చెక్కును అందజేసిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి




**శ్రీకాళహస్తి,(ప్రశ్న న్యూస్)** పీఎం అజయ్ పథకం కింద లబ్ధి పొందిన లబ్ధికారులకు 6కోట్ల 30లక్షల 50వేల రూపాయలు , చెక్కును అందజేసిన శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి శ్రీకాళహస్తి మండలంలోని వెలుగు కార్యాలయం నందు పీఎం అజయ్ పథకం కింద లబ్ధి పొందిన లబ్ధిదారులకు ఆరు కోట్ల 30 లక్షల 50 వేల రూపాయలను చెక్కు రూపంలో రుణాలను అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బజ్జల సుధీర్ రెడ్డి పాల్గొని చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ పథకం కింద ఆటో ను పొందిన లబ్ధిదారుని కుటుంబానికి ఆటోని అందజేశారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వం మహిళాసాధికారతే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు తీసుకొని వచ్చిందని, ఇందులో భాగంగానేడు పీఎం అజయ్ పథకం కింద 6 కోట్ల 30 లక్షల 50 వేల రూపాయలు లబ్ధిదారులకు చెక్కు రూపంలో రుణాన్ని అందజేశామని, తద్వారా మహిళలకు స్వయం ఉపాధి పొంది, జీవనాధారం సాగించుకునేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశయాలకు అనుగుణంగా తాము రాష్ట్రంలో 33% మహిళలకు రాజకీయ రంగంలో రిజర్వేషన్ కల్పిస్తామని, రానున్న పంచాయతీ ఎన్నికల్లో సర్పంచులుగా 33% మహిళలకు అవకాశం కల్పించే విధంగా తాను కార్యాచరణ చేపట్టనున్న అని తెలియజేశారు, మహిళలు అన్నిరంగంలో అభివృద్ధి పరిచే విధంగా తాను కృషి చేస్తానన్నారు పీఎం అజయ్ పథకం కింద లబ్ధి పొందిన మహిళలు ఈ అవకాశాన్ని పొందిపుచ్చుకొని, జీవితంలో ఉన్నత శిఖరాలకు అధిరోహించి, ఆర్థికంగా స్వాలంబతతో, ఎదగాలని,ఈ సందర్భంగా మహిళలకు తెలియజేశారు.

# ఇంద్రమ్మ ఇళ్లను ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి

**- పేదల సొంతింటి కల సాకారం**



**గజ్వేల్( ప్రశ్న న్యూస్ )** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదిపూర్ గ్రామంలో మంద శేఖర్ గురువారం ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం పూర్తి కా వడంతో గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి వైస్ చైర్మన్ సర్దార్ కాన్ హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పదకం ఇం దిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తికావడం లబ్దిదారు లు నూతన గృహప్రవేశం చేయడం ఎంతో సం తోషంగా ఉన్నదన్నారు నేడు ఇల్లు పూర్తి నిర్మాణం చేసుకొని ప్రారంభించడం జరిగిందన్నారు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మాణానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆంక్ష రెడ్డి నియోజకవర్గ ప్రజలందరి తరపున ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మహేశ్వరి మల్లికార్జున్ , కాంగ్రెస్ నాయకులు సుఖేందర్ రెడ్డి సమీర్ రమేష్ గౌడ్, కర్ణాకర్ రెడ్డి, అజ్గర్, బాల్ గౌడ్, ఎల్లగౌడ్, రామచంద్ర రెడ్డి, మంద నరసింహులు బాల్ రాజు గౌడ్, అంజా గౌడ్, బోయిన్ రామచంద్రం పాల రాములు గౌడ్ ఆర్మల రామచంద్రం ఆకుల ప్రభాకర్ , మల్లేశం బిక్షపతి, బుచ్చిరెడ్డి,శేశక్, తదితరులు పాల్గొన్నారు

# గజ్వేల్‌లో బీజేపీకి షాక్..

**బీఆర్ఎస్‌లో చేరిన సీనియర్ నేత రామచంద్ర చారి దంపతులు**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** సిద్ధిపేట జిల్లా గజ్వేల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. గజ్వేల్ బీజేపీ సీనియర్ నేత, మాజీ కౌన్సిలర్ రామచంద్ర చారి దంపతులు భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు.గజ్వేల్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్.సి. రాజమౌళి, బీఆర్ఎస్ యువజన నాయకుడు ఎన్.సి. సంతోష్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి టీ . హరీష్ రావు సమక్షంలో వారు బీఆర్ఎస్ కండువా కప్పుకుని పార్టీలో చేరారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, రామచంద్ర చారి దంపతుల చేరికతో గజ్వేల్ పట్టణంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ప్రజా సేవే లక్ష్యంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు రామచంద్ర చారి తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక మాజి కౌన్సిలర్లు వసీం ఖాన్, కళ్యాణ్కార్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సాయికృష్ణ ఘటనకు జనసేన కు సంబంధం లేదు

**విజయవాడ** కృష్ణలంకకు చెందిన గాదే సాయికృష్ణ విషయములో జరిగిన సంఘటనకు జనసేన పార్టీకి ఎటువంటి సంబంధమూ లేదని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి విజయవాడ తూర్పు నియోజకవర్గం మరియు విజయవాడ పార్లమెంట్ సమన్వయకర్త అమ్మిశెట్టి వాసు స్పష్టం చేసారు. ఈ విషయంపై వైఎస్ఆర్సిపి కావాలనే రాజకీయం చేస్తుంది. రాష్ట్రంలో ఏది జరిగిన అది పవన్ కళ్యాణ్ గారికి మరియు జనసేన పార్టీకి ఆపాదించి మాట్లాడటం మరియు కులం పేరుతో నీచ రాజకీయాలు చేయడం వైసిపి మానుకోవాలి.


# ' థాంక్యూ సుబ్బారావు' మూవీ రిలీజ్!




క్రైమ్ థ్రిల్లర్ జోనర్లో నిర్మితమైన ఒక తెలుగు సినిమా నేరుగా ఓటీటీ ఫ్లాట్ ఫామ్ పైకి వచ్చింది. ఆ సినిమా పేరే ' థాంక్యూ సుబ్బారావు'. చంద్రహాస్ కోట్ల – లావణ్య సాహుకార జంటగా నటించిన ఈ సినిమాకి చెందు ముద్దు దర్శకత్వం వహించాడు.'ఓ పిట్టకథ' సినిమాతో దర్శకుడిగా తన మార్క్ చూపించిన సంగతి తెలిసిందే. దినేశ్ కుర్ర నిర్మించిన ఈ సినిమా, ఈ రోజు (జూన్ 18వ తేదీ) నుంచి 'ఆహా' ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది.

సుబ్బారావు (చంద్రహాస్) తన తండ్రి చేసిన అప్పులు తీర్చడం కోసం, ఏదైనా పని వెతుక్కోవాలని అనుకుంటాడు. కేరళలో ఉన్న స్నేహితుడు 'పండు' రమ్మనడంతో అక్కడికి వెళతాడు. స్నేహితుడితో కలిసి 'బోట్ హౌస్'లో ఉంటూ, టాక్సీ డ్రైవర్ గా పనిచేస్తుంటాడు. అదే సమయంలో ఒక బిజినెస్ డీల్ పై అమెరికా నుంచి 'వైష్ణవి' (లావణ్య) వస్తుంది. నెల రోజుల పాటు తిరగడం కోసం ఆమె సుబ్బారావు టాక్సీని మాట్లాడుకుంటుంది. వైష్ణవితో కలిసి తిరుగుతూ ఉండటంతో సుబ్బారావుకి రోజులు చాలా అందంగా గడిచిపోతున్నట్టుగా అనిపిస్తుంది. ఆమె ఎంతో కలుపుగోలుగా మాట్లాడుతూ ఉండటంతో, తనని ఆమె లవ్ చేస్తుందేమోనని సుబ్బారావు భావిస్తాడు. తానే ప్రపోజ్ చేయడం మంచిదని భావిస్తాడు. అయితే అదే సమయంలో అమెరికా నుంచి 'రోహిత్' దిగిపోతాడు. అతను .. వైష్ణవి పెళ్లి చేసుకోబోతున్నారనే విషయం తెలిసి, సుబ్బారావు దిగాలుపడిపోతాడు.ఒక రోజున ట్రైన్ రన్నింగ్ లో ఉండగా, ఓ నలుగురు కుర్రాళ్లు ఒక అమ్మాయిని అందులో నుంచి తోసేయడానికి ప్రయత్నించే దృశ్యం వైష్ణవి సెల్ ఫోన్ కి చిక్కుతుంది. దాంతో ఆమె ఆ అమ్మాయి ఎవరు? ఆ కుర్రాళ్లు ఎవరు? ఆ అమ్మాయిని వాళ్లు ఏం చేసి ఉంటారు? అనేది తెలుసుకోవాలని వైష్ణవి నిర్ణయించుకుంటుంది. అందుకోసం ఆమె ఏం చేస్తుంది? పర్యవసానంగా ఎలాంటి పరిణామాలను ఎందుర్కుంటుంది? అనేది మిగతా కథ. అమెరికా నుంచి బిజినెస్ పనిపై వచ్చిన వైష్ణవి, రన్నింగ్ ట్రైన్ లో నలుగురు దుర్మార్గుల కారణంగా ఒక యువతి ప్రమాదంలో ఉండటం గమనిస్తుంది. ఆ యువతి ఆచూకీ తెలుసుకుని ఆమెకి న్యాయం జరిగేలా చేయాలనుకుంటుంది. అందుకోసం తన బిజినెస్ పనులను సైతం పక్కన పెడుతుంది. ఈ విషయంలో ఆమెకి ఒక టాక్సీ డ్రైవర్ ఎలా సహాయం చేస్తాడు? ఆమె ప్రయత్నం ఫలిస్తుందా లేదా? అనేదే ఈ కథలోని ప్రధానమైన అంశం. ఈ కథ 'కేరళ'లో జరుగుతుంటుంది. ఎంగేజ్ మెంట్ జరుపుకున్న వైష్ణవి – రోహిత్, కేరళలో హోటల్ బిజినస్ చేయడానికి తగిన అనుమతుల కోసం ట్రై చేస్తుండటం .. వాళ్లకి టాక్సీ డ్రైవర్ గా కుదిరిన సుబ్బారావు, వైష్ణవిని ఆరాధిస్తూ ఉండటం .. ప్రమాదంలో పడిన ఒక యువతిని రక్షించడం రంగంలోకి దిగిన వైష్ణవి, రోహిత్ ను – సుబ్బారావును సాయం కోరడం అనే ఈ మూడు కోణాలలో ఈ కథ ముందుకు వెళుతుంటుంది. సుబ్బారావు కేరళ చేరుకోవడం .. అమెరికా నుంచి వైష్ణవి రావడం .. ఇద్దరి మధ్య పరిచయం తాలూకు సన్నివేశాలతో ఈ కథ అలరిస్తూ వెళుతుంది. ఎప్పుడైతే వైష్ణవికి కాబోయే భర్తగా రోహిత్ ఎంట్రీ ఇచ్చాడో అప్పటి నుంచి కథ మరింత ఊపందుకుంటుంది. వైష్ణవి ముందు సుబ్బారావును అవమానించడానికి రోహిత్ ట్రై చేయడం, అతణ్ణి ఉడికించడానికి సుబ్బారావు ప్రయత్నించడం వంటి సన్నివేశాలతో లవ్ కి కాస్త కామెడీ కనెక్ట్ అవుతుంది. ఇక ఎప్పుడైతే ట్రైన్ లో ఒక ఆడపిల్లను వేధిస్తున్న రౌడీ గ్యాంగ్ ను వైష్ణవి చూసిందో .. ఆ విషయాన్ని గురించి ఆరాతీయడానికి రంగంలోకి దిగుతుందో అప్పటి నుంచి కథ మరో మలుపు తీసుకుంటుంది. ట్రైన్ లో వేధింపులకు గురైన ఆ యువతి ఎవరు? ఆమెను వేధించిన పోకిరీలు ఎవరు? అనే కోణంలో చకచకా సన్నివేశాలను మార్చుకుంటూ ఈ కథ పరుగులు తీస్తుంది. లవ్ .. కామెడీ .. క్రైమ్ ను టచ్ చేస్తూ సాగే ఈ కంటెంట్ ఫరవాలేదని పిస్తుంది.మూడు ప్రధానమైన పాత్రల చుట్టూ దర్శకుడు ఈ కథను నడిపించాడు. కథలో పెద్దగా కొత్తదనం లేకపోయినా, ట్రీట్మెంట్ బాగుంటుంది. అయితే లవ్ ట్రాక్ విషయంలో ఆడియన్స్ గెస్ చేసినట్టుగానే కథ వెళ్లడమే ప్రధానమైన లోపంగా అనిపిస్తుంది. కేరళలోని సన్నివేశాలు ఈ కథకు అదనపు ఆకర్షణగా నిలిస్తే, క్లైమాక్స్ లో వచ్చే ట్విస్ట్ ఈ కథకి మరింత బలాన్ని చేకూర్చుతుంది. ప్రధానమైన పాత్రలను పోషించిన ముగ్గురు ఆర్టిస్టులు తమ పాత్రలకి న్యాయం చేశారు. హీరో చంద్రహాస్ ను చూస్తుంటే, చాలావరకూ RX 100' హీరో కార్తికేయ పోలికలు కనిపిస్తాయి. బాడీ లాంగ్వేజ్ కూడా దాదాపుగా అలాగే అనిపిస్తుంది. పంకజ్ తొత్తాడ ఫొటోగ్రఫీ .. ప్రిన్స్ హెన్రి సంగీతం .. వెంకట్ ప్రభు ఎడిటింగ్ ఫరవాలేదు. చిన్న సినిమానే అయినా, ఒక పెర్ఫెక్ట్ అవుట్ పుట్ తో వచ్చిన కంటెంట్ గా చెప్పుకోవచ్చు.

## దేశ విభజన నేపథ్యంలో
# సన్నీ డియోల్ 'బట్వారా 1947'




బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ హిస్టారికల్ డ్రామా 'బట్వారా 1947' (దీఘ్ఘుతీఘు 1947) నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. దేశ విభజన నాటి భయానక పరిస్థితులు, ద్వేషం మధ్య ఒక వ్యక్తి చూపించిన అసాధారణ ధైర్యం నేపథ్యంలో సాగే భావోద్వేగభరిత చిత్రంగా ఈ చిత్రం రాబోతున్నట్లు టీజర్‌ను చూస్తే అర్థమవుతుంది. ఇక ఈ చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా 2026, ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. గతంలో 'ఘాయల్', 'దామిని', 'ఘాతక్' వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన స్టార్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సంతోషి, సన్నీ డియోల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన 'ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం. ఈ చిత్రంలో సన్నీ డియోల్ సరసన సీనియర్ స్టార్ హీరోయిన్ ప్రీతి జింతా నటిస్తుండగా, శబానా అజ్మీ, అలీ ఫజల్, కరణ్ డియోల్, కనికా కపూర్, సర్గమ్ సింగ్, ఖుషీ హజారే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ గ్రహీత ఎ.ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.

# లంకా దహనం సీత చేస్తే..



అలియాభట్, శార్వరి వాఘ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఫిమేల్ ఓరియెంటెడ్ స్పైథ్రిల్లర్ 'ఆల్ఫా' సినిమా ట్రైలర్‌ను బుధవారం విడుదల చేశారు. యశ్‌రాజ్ ఫిల్మ్ స్పై యూనివర్స్‌లో భాగంగా ఈ సినిమా రానుంది. ఇందులో అలియాభట్ గూఢచారి పాత్రలో కనిపించనుంది. దేశానికి వ్యతిరేకంగా 'ఆల్ఫా' పేరుతో ప్రతినాయకుడు నడిపే మిషన్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా అలియాభట్ బృందం చేసిన సాహసాలు ఏమిటన్నదే ఈ సినిమా ఇతివృత్తం. హై ఇంటెన్సిటీ యాక్షన్‌తో ట్రైలర్ ఆద్యంతం థ్రిల్‌ని పంచింది. బాబీడియోల్ క్రూరుడైన విలన్ పాత్రలో కనిపించాడు. 'సీత లంకాదహనం చేస్తే ఎలా ఉంటుందో చూడాలనుకుంటున్నారా' అంటూ అలియాభట్ చెప్పిన డైలాగ్ ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచింది. ఆదిత్యచోప్రా నిర్మాణంలో శివ్ రవాలీ దర్శకత్వం వహించిన ఈ సినిమా జూలై 3న ప్రేక్షకుల ముందుకురానుంది.

# 'దృశ్యం 3' తెలుగు ఓటీటీ రిలీజ్‌కు బ్రేక్..



మోహన్‌లాల్ నటించిన 'దృశ్యం 3' తెలుగు డబ్బింగ్ వెర్షన్‌కు ఓటీటీలో విడుదలకు అడ్డంకులు ఎదురయ్యాయి. తెలుగు హక్కులపై వివాదం తలెత్తడంతో మద్రాస్ హైకోర్టు తాత్కాలికంగా విడుదలను నిలిపివేసింది.తెలుగులో 'దృశ్యం' తొలి భాగాన్ని తెరకెక్కించిన దర్శకురాలు శ్రీప్రియ, ఆమె సంస్థ రాజ్‌కుమార్ థియేటర్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టును ఆశ్రయించాయి. 'దృశ్యం' ఫ్రాంచైజీ తెలుగు హక్కులు తమ వద్ద ఉన్నాయని, మూడో భాగాన్ని డబ్బింగ్ రూపంలో విడుదల చేయడం సరికాదని పిటిషన్‌లో పేర్కొన్నాయి. ఈ వాదనలను పరిశీలించిన కోర్టు, తదుపరి విచారణ వరకు తెలుగు డబ్బింగ్ వెర్షన్‌ను ఓటీటీలో విడుదల చేయవద్దని ఆదేశించింది. దీంతో జూన్ 18 నుంచి స్ట్రీమ్ రావాల్సిన తెలుగు వెర్షన్‌కు తాత్కాలికంగా బ్రేక్ పడింది.గతంలో 'దృశ్యం', 'దృశ్యం 2' సినిమాలు వెంకటేశ్ హీరోగా తెలుగులో రీమేక్ అయ్యాయి. అయితే మూడో భాగాన్ని రీమేక్ చేయకుండా నేరుగా డబ్బింగ్ వెర్షన్‌గా తీసుకురావాలని నిర్మాతలు నిర్ణయించారు. ఇదే ఇప్పుడు వివాదానికి కారణమైంది.

# ఓవర్సీస్‌లో సమంత సత్తా..

## రికార్డు స్థాయిలో 'మా ఇంటి బంగారం' ప్రీ సేల్స్




స్టార్ హీరోయిన్ సమంత తన స్టార్‌డమ్‌ను మరోసారి ఘనంగా చాటుకున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం విడుదల కాకముందే ఓవర్సీస్‌లో, ముఖ్యంగా నార్త్ అమెరికాలో సంచలనం సృష్టిస్తోంది. ఈ సినిమా ప్రీ సేల్స్ ఇప్పటికే 3 లక్షల డాలర్ల (సుమారు రూ. 2.5 కోట్లు) మార్కును దాటేశాయి. సమంత కెరీర్‌లోనే ప్రీ సేల్స్ ద్వారా ఈ స్థాయిలో వసూళ్లు రావడం ఇదే తొలిసారి. జూన్ 19న ఈ చిత్రం వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది. నేడు (జూన్ 18) ఈ చిత్రం ప్రీమియర్స్ ప్రదర్శితం కానుండగా, అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలో ఈ స్థాయి వసూళ్లు రావడం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ప్రత్యంగిర సినిమాస్ ఈ చిత్రాన్ని ఓవర్సీస్‌లో విడుదల చేస్తోంది. బుకింగ్స్ ఇంకా కొనసాగుతున్నాయని, వసూళ్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆ సంస్థ ప్రకటిం చింది. ఈ అద్భుతమైన ప్రారంభం సినిమాపై ఉన్న భారీ అంచనాలకు నిదర్శనంగా నిలుస్తోంది. 'ది ఫ్యామిలీ మ్యాన్' వెబ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన రాజ్ నిడిమోరు ఈ చిత్రానికి క్రియేటర్‌గా వ్యవహరించారు. సమంతతో గతంలో 'ఓ బేబీ' వంటి విజయవంతమైన సినిమా తీసిన నందినీ రెడ్డి దర్శకత్వం వహించారు. వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రంలో గుల్షన్ దేవయ్య, గౌతమి, దిగంత్ మంచాలే కీలక పాత్రలు పోషించారు. ఈ రికార్డు స్థాయి ప్రీ సేల్స్, ఓవర్సీస్ మార్కెట్‌లో సమంతకున్న తిరుగులేని క్రేజ్‌ను స్పష్టం

# 'మైసా'లో నక్సలైట్‌గా?



అగ్ర కథానాయిక రష్మిక మందన్న నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాల్లో రష్మిక ఫెరోషియస్ లుక్స్‌తో సర్‌ప్రైజ్ చేసింది. ఈ సినిమాలో ఆమె గోండు తెగకు చెందిన గిరిజన మహిళ పాత్రను పోషిస్తున్నది. కెరీర్‌లో తొలిసారి ఫుల్‌లెంగ్త్ యాక్షన్ రోల్‌చేస్తుండటంతో ఈ సినిమా విషయంలో రష్మిక మందన్న ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో ఆమె నక్సలైట్ పాత్రలో కనిపించనుందని తెలిసింది. వ్యవస్థపై ధిక్కార స్వరం వినిపించే ధీరోదాత్తురాలైన గిరిజన మహిళగా ఆమె పాత్ర అత్యంత శక్తివంతంగా సాగుతుందని చెబుతున్నారు. అయితే ఆమె పాత్ర తాలూకు అసలైన వివరాలు తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. పాన్ ఇండియా రిలీజ్ కానుంది.

తెలంగాణకు పొంచి ఉన్న

# ప్రమాదాన్ని గుర్తించాలి

- పవన్ కళ్యాణ్ వెనుక బీజేపీ హస్తం ఉంది
- సినిమా స్టార్లను రాజకీయ నాయకులుగా చూడొద్దు
- తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు
-సాధన రౌండ్ టేబుల్ సమావేశంలో టీఆర్ఎస్ పార్టీ చీఫ్ కవిత వ్యాఖ్యలు




**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర అస్తిత్వం, సంస్కృతి, స్వాభిమానాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు--సాధన పేరిట గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడారు. పవన్ కళ్యాణ్ వెనుక బీజేపీ హస్తం ఉందనే అనుమానం కలుగుతోందని, బీజేపీ నేరుగా పోటీ చేస్తే ప్రజాదరణ లభించదనే భావనతో ఇతర రూపాల్లో తెలంగాణ రాజకీయాల్లో ప్రవేశించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తెలంగాణ సమాజం అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. సినిమా నటులను వినోద రంగానికే పరిమితం చేయాలని, వారిని రాజకీయ నాయకులుగా చూడొద్దని యువతకు సూచించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతిని అవమానించే శక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే తెలంగాణ గ్రామీణ దేవతల ఆరాధన సంప్రదాయాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. తెలంగాణ కోసం ఎన్నో సంవత్సరాలు పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్నామని, ఇప్పుడు మరోసారి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకునేందుకు ప్రజలు ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణకు నిజంగా ప్రమాదం వాటిల్లితే రాష్ట్ర రక్షణ కోసం ప్రాణాలర్పించడానికైనా సిద్ధంగా ఉంటామని తెలిపారు. రాజకీయాల్లో కోటరీ సంస్కృతికి తావు ఉండదని స్పష్టం చేసిన కవిత, టీఆర్ఎస్-2లో ప్రతి కార్యకర్తకు ప్రాధాన్యం ఉంటుందని హామీ ఇచ్చారు. పార్టీలో ప్రతి కార్యకర్తకు తనతో నేరుగా మాట్లాడే అవకాశం ఉంటుందని చెప్పారు. మహిళలకు రాజకీయాల్లో అధిక ప్రాధాన్యం కల్పిస్తామని, తమ పార్టీ నుంచి కనీసం 33 శాతం టికెట్లు మహిళలకు కేటాయిస్తామని వెల్లడించారు. భవిష్యత్తులో 50 శాతం ప్రాతినిధ్యం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం వంటి అంశాలపై సమగ్ర అధ్యయనం చేసిన తర్వాతే తమ పార్టీ విధానాలను ప్రకటించామని తెలిపారు. మేధావులు, ఉద్యమకారులు, ఉద్యోగ విరమణ పొందిన అధికారులు, వివిధ సామాజిక వర్గాల సూచనలతో ప్రజా రాజకీయాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. సమావేశంలో ఆరు తీర్మానాలు ఆమోదించినట్లు వెల్లడించారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం సహాయం అందించడం, ఉద్యమకారుల హక్కుల సాధన కోసం పోరాటం చేయడం, తెలంగాణపై చేసిన వ్యాఖ్యలకు పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయడం, తెలంగాణ ద్రోహులకు మద్దతు ఇచ్చేవారిని కూడా వ్యతిరేకించడం, కరీంనగర్ జాలిగుట్టలో ఉద్యమకారులకు 250 గజాల స్థలాలు కేటాయించడం, కరీంనగర్ పట్టణంలో ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వంటి తీర్మానాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు.

## బూరుగుపల్లి లో సేవాభావం చాటుకున్న తూడి లచ్చన్న

- క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న లతకు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేత



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, బూరుగుపల్లి గ్రామానికి చెందిన క్యాన్సర్ వ్యాధితో గత ఏడాదిగా తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న తాళ్లపల్లి లతకు ప్రముఖ సామాజికవేత్త తూడి లచ్చన్న గురువారం ఆర్థిక సహాయం అందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. లత వైద్య చికిత్సకు ఉపయోగపడేలా రూ. 10,000 నగదు సహాయాన్ని ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా తూడి లచ్చన్న మాట్లాడుతూ, తాళ్లపల్లి లత అనారోగ్య పరిస్థితి గురించి సామాజిక మాధ్యమాలు, పత్రికా కథనాలు, అలాగే వివిధ రాజకీయ పార్టీల నాయకుల ద్వారా తెలుసుకున్నానని తెలిపారు. కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో తన వంతు బాధ్యతగా ఈ సహాయాన్ని అందించినట్లు పేర్కొన్నారు. సమాజంలో కష్టాల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు తోడ్పాటు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. ఆపదలో ఉన్నవారికి చేయూతనివ్వడం ద్వారా సమాజంలో మానవీయ విలువలు మరింత బలపడతాయని చెప్పారు. లత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య - మహేష్, ఉపసర్పంచ్ కల్లెపల్లి చంద్రయ్య, వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొని బాధిత కుటుంబానికి తమ సంఘీభావాన్ని తెలిపారు.

రూసో డి.ఎడ్ కళాశాల ప్రిన్సిపాల్

## కొండ దేవేందర్ కు డాక్టరేట్ ప్రదానం

- వలస కార్మికుల సమస్యలపై పరిశోధనకు డాక్టరేట్
- రూసో విద్యా సంస్థల అధినేత దేవేందర్ రావు చేతులమీదుగా ఘన సన్మానం



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన రూసో డి.ఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ కొండ దేవేందర్‌కు శాతవాహన విశ్వవిద్యాలయం సామాజిక శాస్త్ర విభాగం నుంచి పీహెచ్‌డీ పట్టా లభించింది. ప్రొఫెసర్ సూరపల్లి సుజాత పర్యవేక్షణలో "ఇష్యూస్ అండ్ చాలెంజెస్ ఆఫ్ మైగ్రెంట్ వర్కర్స్ ఇన్ పోస్ట్ కోవిడ్: ఎ స్టడీ ఆఫ్ ఎరస్ట్‌వైల్ కరీంనగర్ డిస్ట్రిక్ట్" అనే అంశంపై పరిశోధన చేసి సోషియాలజీలో డాక్టరేట్‌ను పొందారు. ఈ సందర్భంగా రూసో విద్యాసంస్థల అధినేత పి. దేవేందర్‌రావు కొండ దేవేందర్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు. డాక్టరేట్ సాధనలో తనకు సహకరించిన కిమ్స్ విద్యాసంస్థల అధినేతలు పి. రవీందర్‌రావు, పి. దేవేందర్‌రావు, వైస్ చైర్మన్ సాకేత్ రామారావు, అలాగే తోటి మిత్రులకు కొండ దేవేందర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# సిరిసిల్లలో తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ

## – అధికార, ప్రతిపక్షాలపై విమర్శలు

- నేరేళ్ళ బాధితులకు అండగా టీఆర్ఎస్ పార్టీ - సామాజిక న్యాయం కోసం పాంచజన్య యాత్ర
- పేదలు, రైతులు, యువత కోసమే తెలంగాణ రక్షణ సేన పార్టీ
- వీకెండ్ ఎమ్మెల్యే కేటీఆర్ - సిరిసిల్ల నుండే రాజకీయ పోరాటానికి శ్రీకారం
- తెలంగాణ రక్షణ సేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు : కల్వకుంట్ల కవిత





**సిరిసిల్ల (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో గురువారం " టీఆర్ఎస్ జెండా పండుగ" కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరించి సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిరిసిల్ల ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వం, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. సిరిసిల్లకు కాళేశ్వరం నీటిని పూర్తిస్థాయిలో అందించడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ఆరోపించారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రకటించిన పథకాలు అమలు కాలేదని, వర్కర్ టు ఓనర్ వంటి హామీలు నెరవేరలేదన్నారు. నేరేళ్ళ ఘటన బాధితులకు ఇప్పటికీ పూర్తి న్యాయం జరగలేదని పేర్కొంటూ, బాధిత కుటుంబాలకు అండగా నిలిచి న్యాయం జరిగేలా పోరాడుతామని హామీ ఇచ్చారు. ఈ అంశంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు స్పందించాలని కోరారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా పేదలు, మధ్యతరగతి ప్రజలు విద్య, వైద్యం కోసం అధిక ఖర్చులు భరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే ఉచిత విద్య, ఉచిత వైద్యం, యువతకు ఉపాధి అవకాశాలు, రైతులకు ప్రత్యేక సేవలు అందిస్తామని ప్రకటించారు. రైతులకు యూరియా సరఫరాలో సమస్యలు ఉన్నాయని పేర్కొంటూ, ప్రస్తుతం అమలులో ఉన్న యాప్ విధానాన్ని పునఃసమీక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. మహిళలకు ప్రాధాన్యత కల్పించే లక్ష్యంతో పార్టీ జెండాలో పసుపు రంగును చేర్చినట్లు తెలిపారు. తెలంగాణలో సామాజిక న్యాయం, రైతు సంక్షేమం, యువత ఉపాధి, మహిళల సాధికారత కోసం తెలంగాణ రక్షణ సేన పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు. సభకు పెద్ద సంఖ్యలో మహిళలు, యువత, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు.

సర్ ప్రక్రియలో బీసీ సంఘాలు

## భాగస్వాములు కావాలి

- పొలాస నరేందర్



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో జూన్ 25 నుంచి జులై 24 వరకు నిర్వహించనున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియ పారదర్శకంగా, పటిష్టంగా జరిగేందుకు బీసీ సంఘాలు భాగస్వాములు కావాలని ఉత్తర తెలంగాణ జిల్లాల బీసీ సాధికారిత సంఘం ఇంచార్జ్ పొలాస నరేందర్ కోరారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో కొనసాగి, అనర్హుల పేర్లు తొలగించబడేలా క్షేత్రస్థాయిలో జాబితాలను పరిశీలించాలని ఆయన సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, ఎవరూ ఓటరు జాబితా నుంచి తప్పిపోకుండా చూడటం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. సర్ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా బీసీ సంఘాల నేతలు, సభ్యులు చురుకుగా పాల్గొని కార్యక్రమం విజయవంతానికి సహకరించాలని నరేందర్ విజ్ఞప్తి చేశారు. ఓటు హక్కు ప్రాధాన్యాన్ని యువతకు తెలియజేసి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

వార్షికోత్సవ వేడుకలకు ముస్తాబైన

## శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం

- విలాసాగర్‌లో నేడే శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ 4వ వార్షికోత్సవం
- భక్తుల రాకకు విస్తృత ఏర్పాట్లు పూర్తి
- విలాసాగర్ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో 4వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 7:30 గంటలకు స్వామివారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చనలు, హారతి, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 11:30 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్య కళ్యాణోత్సవం వైభవంగా జరగనుంది. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య కోరారు.

## రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలకు కాంగ్రెస్ శ్రేణులు హాజరుకావాలి

- భీంగల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు : మల్లెల లక్ష్మణ్



**భీంగల్ (ప్రశ్నన్యూస్)** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను నేడు శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు భీంగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు భీంగల్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ అనుబంధ విభాగాల ప్రతినిధులు, మీడియా సోదరులు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో రాహుల్ గాంధీ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా స్మరించుకుంటూ, పార్టీ శ్రేణులందరూ ఐక్యంగా పాల్గొనాలని మల్లెల లక్ష్మణ్ పిలుపునిచ్చారు.

బూరుగుపల్లి ప్రాథమిక పాఠశాలలో

## ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

- ప్రభుత్వ పాఠశాలలపై పెరుగుతున్న నమ్మకం - నూతనంగా 8 అడ్మిషన్లు
- బూరుగుపల్లి మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు : సత్యనారాయణ



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం సామూహిక అక్షరాభ్యాసం, నోట్‌బుక్స్, టెక్స్ట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య - మహేష్, ఉపసర్పంచ్ కల్లెపల్లి చంద్రయ్య,పాలకవర్గ సభ్యులు, పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు శ్రీకాంత్, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై చిన్నారులకు ఆశీర్వాదాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సౌమ్య - మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసి విద్యాభ్యాసంలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు ఒకటో తరగతిలో ఏడుగురు, మూడో తరగతిలో ఒకరు చేరడంతో మొత్తం ఎనిమిది మంది కొత్త విద్యార్థులు అడ్మిషన్ పొందినట్లు తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో మరింత మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

## ముగిసిన అంతర్యుద్ధం మూడు రోజుల ఉద్రిక్తతకు తెర

- పోలీసుల చాకచక్యంతో శాంతి
- అల్లర్లను అదుపు చేసిన ఖాకీలు - ప్రజల మన్ననలు.
- రాత్రింబవళ్లు శ్రమించి శాంతి నెలకొల్పిన పోలీసులు -
- "సేవలు మరువలేం" అంటున్న గిరిజనులు. గిరిజనేతురులు.
- సద్దుమణిగిన ఘర్షణలు - సమయస్ఫూర్తితో వ్యవహరించిన పోలీస్ శాఖ.
- చట్టం చేతిలోకి తీసుకుంటే ఊరుకోం: ఏటూరు నాగారం ఏ ఎస్పీ హెచ్చరిక -
- అల్లర్ల తర్వాత పూర్తి ప్రశాంతత. శాంతి నెలకొల్పిన పోలీసులు



**ఏటూరు నాగారం (ప్రశ్న న్యూస్)** గత మూడు రోజులుగా ఏటూరు నాగారం పరిధిలో గిరిజనులకు గిరిజనేతూరులకు మధ్య చెలరేగిన ఘర్షణలు, అల్లర్లను పోలీసు శాఖ సమయస్ఫూర్తితో అదుపులోకి తీసుకువచ్చింది. ఎటువంటి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టి పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకువచ్చిన పోలీసుల సేవలపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే, గత మంగళవారం నుండి గిరిజనులకు గిరిజనేతూరులకు మధ్య చిన్న వివాదం కాస్తా అల్లర్లకు దారితీసింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఏటూరు నగరం ఏ ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బలగాలను మోహరించారు. 24 గంటలు పెట్రోలింగ్ నిర్వహిస్తూ, ఇరు వర్గాల పెద్దలతో శాంతి కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యను సామరస్యంగా పరిష్కరించారు.

### ప్రజల స్పందన..

"పోలీసులు లేకపోతే పరిస్థితి చేయిదాటిపోయేది. రాత్రి పగలు తేడా లేకుండా మా రక్షణ కోసం నిలబడ్డారు. వారి సేవలు మర్చిపోలేనివి" అని స్థానిక గిరిజన నాయకుడు పులిసే బాలకృష్ణ అన్నారు.

మరో మహిళా సంఘం నాయకురాలు మహాలక్ష్మి మాట్లాడుతూ, "అల్లర్ల వల్ల ప్రజలు పనులకు వెళ్లలేకపోయారు. పోలీసులు వెంటనే స్పందించి బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఇప్పుడు అంతా ప్రశాంతంగా ఉంది. పోలీస్ శాఖకు కృతజ్ఞతలు" అని తెలిపారు.

### పోలీసుల వివరణ..

ఎస్ ఐ మహేశ్ మాట్లాడుతూ, "ప్రజల సహకారంతోనే శాంతి నెలకొల్పగలిగాం. అల్లర్లకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేశాం. ఎవరూ చట్టాన్ని చేతిలోకి తీసుకోవద్దు. సమస్యలు ఉంటే పోలీస్ స్టేషన్‌కు రావాలి" అని సూచించారు. ప్రస్తుతం ఏటూరు నాగారంలో పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, అదనపు బలగాలు పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు.

# మాతృభాషకు ఘోర అవమానం

- అధికారిక ప్రకటనల్లో మచ్చుకైనా కనిపించని తెలుగు అక్షరాలు - మేడ్చల్ సర్కిల్ కార్యాలయం పరిధిలో వెలసిన పరభాషా బోర్డులు
- నిధులు వృథా చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న అధికారులు - ఓటర్ల చైతన్యం పేరిట కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం
- స్థానిక ప్రజల తీవ్ర ఆగ్రహం

**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** తెలంగాణ రాష్ట్రంలో అధికారిక భాషగా వెలుగొందుతున్న తెలుగుకు సొంత గడ్డపైనే తీవ్ర అన్యాయం జరుగుతోంది. ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వ కార్యాలయాల ముంగిట, మాతృభాషను పూర్తిగా విస్మరించడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. నగర పాలక సంస్థ పరిధిలోని మేడ్చల్ సర్కిల్ కార్యాలయం వద్ద రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆధ్వర్యంలో ఓటర్ల చైతన్యం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ల జాబితా తీవ్ర వివాదానికి దారితీసేలా ఉంది. ప్రజాధనాన్ని లక్షల రూపాయల మేర వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ భారీ ప్రచార బోర్డులలో ఎక్కడా తెలుగు అక్షరం ముక్క కూడా లేకపోవడం గమనార్హం. చిత్రంలో స్పష్టంగా కనిపిస్తున్నట్లుగా.. స్థానిక ప్రజలకు అర్థం కాని ఇతర భాషలలోనే సమాచారాన్ని ముద్రించి చేతులు దులుపుకున్నారు.

## ప్రజా చైతన్యం ఎలా సాధ్యం? స్థానికుల ఆగ్రహం..

తెలంగాణ సమాజంలో అత్యధిక శాతం మంది ప్రజలు తెలుగు భాషలోనే చదవడం, రాయడం చేస్తారు. ముఖ్యంగా ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఓటు హక్కు, ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాలపై సామాన్య ప్రజలకు, నిరక్షరాస్యులకు అవగాహన కల్పించడమే ఈ బోర్డుల ముఖ్య ఉద్దేశం. కానీ, జనాభా ప్రాతిపదికన అత్యధికులు మాట్లాడే మాతృభాషను పక్కన పెట్టి, పరభాషలకు మాత్రమే పెద్దపీట వేయడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఈ బోర్డులో ఉన్న గడువులు, వివరాలు సామాన్యులకు అర్థం కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రాష్ట్రంలో ఓటర్ల నమోదు, సవరణల కాలపట్టిక గురించి సామాన్య ప్రజలకు తెలియజేయడానికే ఈ బోర్డులు ఏర్పాటు చేశామని చెబుతున్నారు. కానీ మాతృభాష అయిన తెలుగును పూర్తిగా పక్కన పెట్టడం వెనుక అంతరార్థం ఏమిటి ? ఈ ప్రచారం ఎవరి కోసం ? అర్థం కాని భాషలో బోర్డులు పెట్టి నిధులు వృథా చేయడం కాదా ? అని స్థానిక పౌరులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## అధికారుల నిర్లక్ష్యంపై వెల్లువెత్తుతున్న విమర్శలు..

ఎన్నికల విభాగం లాంటి బాధ్యతాయుతమైన ఉన్నతాధికారుల కార్యాలయం నుండి వచ్చే ఇటువంటి ముఖ్యమైన ప్రకటనల్లో స్థానిక భాషను నిర్లక్ష్యం చేయడం అధికారుల బాధ్యతారాహిత్యానికి, నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి, పరభాషా బోర్డులను తొలగించి, తెలుగు భాషలో స్పష్టమైన వివరాలతో కూడిన నూతన బోర్డులను ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




# ఒక చట్టం రెండు తీర్పు

## - లంచాలు ఇస్తే ఒకలా.? ఇవ్వకుంటే మరోలా.?

- కవాడిగూడ సర్కిల్లో అక్రమ నిర్మాణాలపై వింత వైఖరి - రెండు ఫీట్లు ముందుకొస్తే నిబంధనలు చట్టం
- రెసిడెన్షియల్ పర్మిషన్ కమర్షియల్ నిర్మాణం, అక్రమ అంతస్తులు, స్టిల్ట్ లో షాపులు అయిన తప్పులేదా.?
- ఉన్నవాడు ఎలా కట్టుకున్న డిప్యూటీ కమిషనర్, ఏసిపి, సెక్షన్ ఆఫీసర్, తప్పనిపించడం లేదు








**ముషీరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగరంలోని కవాడిగూడ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఇటీవల కొన్ని చిన్న స్థాయి అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు చేపట్టగా, నిబంధనలు పూర్తిగా ఉల్లంఘించి భారీ స్థాయిలో నిర్మించబడిన కొన్ని అక్రమ నిర్మాణాలపై మాత్రం ఎలాంటి చర్యలు కనిపించకపోవడం స్థానికుల్లో అనుమానాలకు తావిస్తోంది. కవాడిగూడ సర్కిల్ పరిధిలో "చిన్నవారిపైనే చట్టం పనిచేస్తుందా.? పెద్ద నిర్మాణాలకు మినహాయింపులా.?" అనే ప్రశ్నలు స్థానికుల నుండి వినిపిస్తున్నాయి.

స్థానికుల సమాచారం ప్రకారం, కొన్ని ప్రాంతాల్లో పోలీస్ శాఖ సహకారంతో అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. అయితే ప్రధాన రహదారుల వెంట రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని అక్రమ అంతస్తులు అక్రమ సెల్లార్లు, స్టిల్ట్ లో దుకాణాలు వాణిజ్య అవసరాల కోసం నిర్మించబడిన భారీ భవనాల విషయంలో మాత్రం చర్యలు తీసుకోవడం పూర్తిగా మానేయడంపై స్థానికుల నుండి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లక్షలలో లంచాలు తీసుకొని ఇలా చేస్తున్నారన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. కేవలం ధనార్జనే లక్ష్యంగా కవాడిగూడ సర్కిల్ పరిధిలో మున్సిపల్ చట్టానికి డిప్యూటీ కమిషనర్, ఏసిపి, సెక్షన్ ఆఫీసర్లు డ్యూటీ చేస్తున్నట్లుగా పరిస్థితి మారిందన్న విమర్శలు ఉన్నాయి. చిన్న చిన్న గదులు, అదనపు నిర్మాణాలపై వేగంగా మున్సిపల్ చట్టం పేరుతో స్పందిస్తున్న అధికారులు, భారీ అంతస్తులతో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## పెద్దల నిర్మాణాలకు అధికారుల అండనా .?

కవాడిగూడ సర్కిల్ పరిధిలో కొందరు బిల్డర్లు నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారని, పార్కింగ్ స్థలాలను వాణిజ్య అవసరాలకు మార్చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. డిప్యూటీ కమిషనర్ కు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, పెద్దల నిర్మాణాలపై అసలు చర్యలు తీసుకోవడంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ఫిర్యాదులు వచ్చిన తర్వాత కూడా అధికారులు కేవలం నోటీసులు జారీ చేయడం వరకే పరిమితమవుతున్నారని, ఆ తర్వాత ఎలాంటి అమలు చర్యలు ఉండటం లేదని కేవలం పెద్ద అక్రమ నిర్మాణదారులు ఇచ్చిన లంచాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు పేర్కొంటున్నారు.

## అవినీతి అక్రమాల వెనుక అధికారుల సహకారం..

అక్రమ నిర్మాణాల వెనుక అధికారుల సహకారం ఉందా..? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇటీవల జరిగిన కొన్ని కూల్చివేతల సందర్భంగా పోలీసుల భారీ బందోబస్తు టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు చేస్తున్నారు, ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా ముందస్తు పోలీసులను సహకారం తీసుకుంటూ కూల్చివేతలు చేపట్టారు. అయితే అదే సమయంలో పెద్ద నిర్మాణాల విషయంలో ఎలాంటి కఠిన చర్యలు కనిపించకపోవడంతో "చట్టం అందరికీ సమానమేనా.?" అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పిల్లర్ నెంబర్ 22 ముందు భారీ అక్రమ నిర్మాణం నిర్మిస్తున్నారని అధికారులు సీజ్ చేశారు అక్రమ నిర్మాణదారుడు దానిని రెక్క చేయకుండా తొలగించి నిర్మాణం పూర్తి చేస్తున్న సమయంలో పత్రికలలో కథనాలు రావడంతో కేవలం చిన్న రెండు పార్టీ రంధ్రాలు చేసి తీసుకున్న లంచాలకు న్యాయం చేశారు కానీ ప్రభుత్వాన్ని మోసం చేశారు అని స్థానికులు మండిపడుతున్నారు అయినా ఆ అక్రమ నిర్మాణదారుడు వాటిని కూడా పూడ్చి వేసి స్టిల్ట్ లో వ్యాపారం కోసం షెటర్లు వేశారు అది కూడా రెసిడెన్షియల్ పర్మిషన్ తీసుకుని కమర్షియల్ భవనం నిర్మించారు ఇంత పెద్ద నిర్మాణం అధికారులకు కనిపిస్తలేదు చర్యలు తీసుకుంట లేరు ఎందుకంటే వాళ్ల భారీ స్థాయిలో లంచాలు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి."పేదవాడు ఒక గది ఎక్కువ కట్టుకుంటే వెంటనే అధికారులు వస్తారు. కానీ కోట్ల రూపాయలతో అక్రమంగా నిర్మిస్తున్న భారీ భవనాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా ఎందుకు చర్యలు ఉండవు.? కేవలం లంచాల కోసమే మున్సిపల్ చట్టాన్ని అధికారులు అమ్ముకుంటున్నారా.? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాల విషయంలో అందరికీ ఒకే విధమైన విధానం ఉండాలని, ఎవరి ప్రభావం, రాజకీయ అనుబంధాలు, ఆర్థిక శక్తి ఆధారంగా చర్యలు మారకూడదని వారు కోరుతున్నారు.

## ప్రభుత్వ ఆదాయానికి నష్టం..

మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగడం వల్ల ప్రభుత్వానికి కూడా ఆదాయ నష్టం వాటిల్లుతోందని పట్టణాభివృద్ధి నిపుణులు చెబుతున్నారు. అనుమతుల ప్రకారం నిర్మాణాలు జరగకపోతే మౌలిక సదుపాయాలపై అదనపు భారం పడటంతో పాటు ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ ఇబ్బందులు, డ్రైనేజీ సమస్యలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## జోనల్ కమిషనర్ జోక్యం చేసుకోవాలన్న డిమాండ్

కవాడిగూడ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై జోనల్ కమిషనర్ సమగ్ర విచారణ జరిపి, చిన్నా పెద్దా తేడా లేకుండా ఒకే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు, పౌరసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గతంలో ఇచ్చిన అనుమతులు, ప్రస్తుత నిర్మాణాలు, అదనపు అంతస్తులపై ప్రత్యేక సర్వే నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఏ నిర్మాణాలపై చర్యలు తీసుకున్నారో, ఎన్ని నోటీసులు ఇచ్చారో, ఎన్ని కూల్చివేతలు జరిగాయో ప్రజలకు వెల్లడించాలని కోరుతున్నారు.

# పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై దాడులు

- 350 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం - స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటేశం



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి ( ప్రశ్న న్యూస్ )** సిద్ధిపేట జిల్లా పరిధిలో పీడీఎస్ (పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్) బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను అధికారులు పట్టుకుని 350 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.నమ్మదగిన సమాచారం మేరకు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటేశం నేతృత్వంలో కుకునూర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సీజీ 08 ఏవై 9992, సిద్ధిపేట మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీజీ 08 బీడీ 9492 నంబర్ల లారీలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఎఫ్ఆర్‌కే కెర్నల్స్‌కు చెందిన 350 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు.దీంతో బియ్యంతో పాటు రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్‌లకు అప్పగించారు. అనంతరం సిద్ధిపేట ఏసీఎస్, డీటీసీఓ అధికారులు పంచనామా నిర్వహించారు.ఈ ఘటనపై బాధ్యులపై ఫిర్యాదు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ తనిఖీ కార్యక్రమంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి. పాండరి, ఎస్ఐ సంబశివరావు, సాయి రవి, ఏసీఎస్ఓ సిద్ధిపేట అధికారులు పాల్గొన్నారు.

# విత్తనాలకు స్మార్ట్ కోటింగ్

## - 30 శాతం వరకు అధిక దిగుబడి!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భారత వ్యవసాయ రంగంలో ఒక కీలకమైన మైలురాయి నమోదైంది. విత్తన నాణ్యతను మెరుగుపరిచి, పంట దిగుబడిని గణనీయంగా పెంచే లక్ష్యంతో 'స్మార్ట్ సీడ్ కోటింగ్' సాంకేతికతను భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) ఆవిష్కరించింది. ఈ బయోపాలిమర్ ఆధారిత టెక్నాలజీ ద్వారా క్షేత్రస్థాయి ప్రయోగాల్లో 30 శాతం వరకు అదనపు దిగుబడి సాధించినట్లు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. హైదరాబాద్‌లోని ఐసీఏఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్ ఈ నూతన విధానాన్ని అభివృద్ధి చేసింది. ఈ సాంకేతికతలో భాగంగా విత్తనం చుట్టూ బయోపాలిమర్‌లతో కూడిన ఒక ప్రత్యేక పూతను వేస్తారు. ఇది విత్తనానికి అవసరమైన పోషకాలు, సూక్ష్మజీవులను అందిస్తూ, చీడపీడల నుండి రక్షణ కల్పించే కవచంలా పనిచేస్తుంది. దీనివల్ల విత్తనం త్వరగా మొలకెత్తడంతో పాటు వేర్లు బలంగా విస్తరిస్తాయి. తద్వారా పంట ప్రాథమిక దశలో ఎదురయ్యే ప్రతికూల వాతావరణ మార్పులను మొక్కలు సమర్థవంతంగా తట్టుకుంటాయి.తెలంగాణలో వేరుశనగ, సోయాబీన్ పంటలపై నిర్వహించిన ప్రయోగాల్లో సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే దాదాపు 30 శాతం అధిక దిగుబడి నమోదైంది. అలాగే, దేశవ్యాప్తంగా మొక్కజొన్న, పత్తి, కంది, ఆవాలు వంటి వివిధ పంటలపై చేపట్టిన పరీక్షల్లో ఉత్పాదకత 12 శాతం నుండి 37 శాతం వరకు పెరిగినట్లు వెల్లడైంది. వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులతో సతమతమవుతున్న రైతులకు ఈ సాంకేతికత ఎంతో ఆశాజనకంగా నిలుస్తుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఈ నూతన టెక్నాలజీని దేశవ్యాప్తంగా రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో కలిసి పనిచేయడానికి ఐసీఏఆర్ సన్నాహాలు చేస్తోంది.

## జీ7 తీర్మానాన్ని పూచికపుల్లలా

# తీసిపారేసిన కిమ్ సోదరి

## - తమ జోలికి వస్తే విపత్తు తప్పదని తీవ్ర హెచ్చరిక



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** అణు నిరాయుధీకరణ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఉత్తర కొరియా మరోసారి స్పష్టం చేసింది. ఆ దేశ నేత కిమ్ జోంగ్ ఉన్ సోదరి, అత్యంత శక్తివంతమైన నాయకురాలిగా పేరున్న కిమ్ యో జోంగ్ గురువారం ఈ మేరకు సంచలన వ్యాఖ్యలు చేశారు. అణు నిరాయుధీకరణ అనేది ఎప్పటికీ జరగని పని అని, అణ్వాయుధాలు తమ దేశ 'ప్రధాన ప్రయోజనాల్లో' భాగమని ఆమె తేల్చిచెప్పారు. ఈ విషయంలో వెనక్కి తగ్గడం అనేది దాటకూడని గీత అని ఆమె స్పష్టం చేశారు. పారిస్‌లో జరిగిన జీ7 దేశాల సదస్సులో, ఉత్తర కొరియాను పూర్తిగా అణు నిరాయుధీకరణ చేయాలని నాయకులు ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాలకు అనుగుణంగా ఇది జరగాలని వారు కోరారు. ఈ డిమాండ్‌పై కిమ్ యో జోంగ్ తీవ్రంగా స్పందించారు. అమెరికా, దాని మిత్రదేశాలు చేస్తున్న ఈ డిమాండ్ 'పాతకాలపుది' అని ఆమె విమర్శించారు. ఉత్తర కొరియా అధికారిక వార్తా సంస్థ కేసీఎన్ఏ ఈ వివరాలను ప్రచురించింది."అణు నిరాయుధీకరణ అనేది వెనక్కి తీసుకోలేని విధంగా ముగిసిపోయిన అజెండా. అది ఎప్పటికీ సాకారం కాదు" అని ఆమె తన ప్రకటనలో పేర్కొన్నారు. అణ్వాయుధాలు తమ సార్వభౌమాధికారాన్ని కాపాడే శక్తివంతమైన సాధనాలని, దేశ శాంతికి మూలస్తంభాలని ఆమె అన్నారు. "అణ్వస్త్ర దేశం యొక్క ప్రధాన ప్రయోజనాలకు హాని తలపెట్టాలని చూసేవారు, విపత్తును ఆహ్వానించినట్టే" అని ఆమె తీవ్రంగా హెచ్చరించారు. అమెరికా, బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, ఇటలీ నేతలు తమ సమావేశంలో ఉత్తర కొరియా అణు, బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, 1970లు, 80లలో కిడ్నాప్‌కు గురైన వారి సమస్యను వెంటనే పరిష్కరించాలని, ఉత్తర కొరియా పాల్పడుతున్న సైబర్ నేరాలు, క్రిప్టోకరెన్సీ దొంగతనాలను కూడా అరికట్టాలని వారు పిలుపునిచ్చారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588